# ప్రజా తపన
prajathapana.com
News that matters




అల్పమైన విషయాలకై ప్రార్థించకండి, శరీర సుఖాల కోసం తాపత్రయపడితే మనుషులకు, జంతువులకు వ్యత్యాసం ఏముంటుంది?

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 37 ఆదివారం 19 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# వారానికి రెండు రోజులు మిల్లెట్స్

## ప్రధాని నరేంద్ర మోదీ



**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

ఢిల్లీలో గ్లోబల్ మిల్లట్ కాన్ఫరెన్స్ లో ప్రధాని నరేంద్ర మోదీ ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ 2023 కి సంబంధించిన అధికారిక పోస్ట్ స్టాంప్‌లను విడుదల చేశారు. ఈ స్టాంప్‌లు విడుదల చేయడం చాలా గర్వంగా ఉందని అన్నారు ప్రధాని. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్‌కు భారత్ నేతృత్వం వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి కాన్ఫరెన్స్‌లు ప్రపంచానికి మేలు చేయడమే కాకుండా...భారత్ బాధ్యతనీ పెంచుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాన్ని భారత్ లీడ్ చేయడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇది మన దేశానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ల సంవత్సరం (ఐవైఎం)గా ప్రకటించిందని తోమర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దాదాపు 75 లక్షల మంది రైతులు వర్చువల్‌గా పాల్గొంటున్నారు. దేశంలో దాదాపు 2.5 కోట్ల మంది తృణధాన్యాలు పండిస్తున్నారు. ఇలాంటి రైతులకు కేంద్ర ప్రవేశ పెట్టిన శ్రీ అన్న పథకం ఎంతో లబ్ధి చేకూరుస్తుంది. మార్కెట్‌లోనూ

(మిగతా 2లో)



## సరిహద్దుల్లో ప్రశాంతంగానే ఉంది

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

భారత్, చైనా సరిహద్దులో పరిస్థితులు ప్రస్తుతానికి స్తబ్దుగానే ఉన్నాయని ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే వెల్లడించారు. ఓ టీవీ ఛానల్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన.. ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే...చైనా ఎప్పుడు ఎలా కవ్విస్తుందో తెలియదు కనుక అప్రమత్తంగా ఉండాల్సిన అవసరమూందని తేల్చి చెప్పారు. రెండు దేశాలూ కలిసి కూర్చుని చర్చించుకునే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. అప్పటి వరకూ సైన్య మొహరింపు చర్యలు కొనసాగుతూనే ఉంటాయని వెల్లడించారు. “ఈ సరిహద్దు సమస్యకు పరిష్కారం దొరికేంత వరకూ సైన్యాన్ని భారీ మొత్తంలో మొహరిస్తూనే ఉంటాం. అప్రమత్తంగానూ ఉంటాం” అని వివరించారు. యుద్ధ రీతులు మారిపోవడం గురించీ ప్రస్తావించారు. ఆర్టిఫిషయల్ ఇంటిలిజెన్స్‌పైనా తన అభిప్రాయాలు పంచుకున్నారు. “ప్రస్తుతానికి సరిహద్దులో పరిస్థితులు ప్రశాంతంగానే ఉన్నాయి. అయినా సరే మేం అప్రమత్తంగా ఉన్నాం. చైనా ప్రతి కదలికనూ సునిశితంగా పరిశీలిస్తున్నాం. సైన్యాన్ని మొహరించే విషయంలో మాత్రం రాజీ పడడం లేదు.

(మిగతా 2లో)

# భయపెడుతున్న కరోనా

## హై అలెర్ట్ జారీ చేసిన కేంద్రం

**ప్రజాతపన , హైదరాబాద్ :**

కరోనా పాజిటివ్ కేసులు మళ్లీ పెరుగుతున్న వేళ తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ జాబితాలో తెలంగాణ పొరుగునున్న మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు తమిళనాడు, కేరళ, గుజరాత్ ఉన్నాయి. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ఆరోగ్య

(మిగతా 2లో)



# అస్సాం రాష్ట్రంలోని జిల్లాల స్వచ్ఛతాపోటీలు



## విజేతగా నిలిచిన జిల్లాకు వంద కోట్ల రూపాయల నగదు

**ప్రజాతపన ,డిస్పూర్ :**

అస్సాంముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మసంచలన ప్రకటన చేశారు. అస్సాం రాష్ట్రంలోని జిల్లాల మధ్యపరిశుభ్రతపై స్వచ్ఛతాపోటీలు పెట్టనున్నారు. కాంపిటీషన్‌లో విజేతగా నిలిచిన జిల్లాకు వంద కోట్ల రూపాయల నగదు బహుమతి

(మిగతా 2లో)



## రద్దయిన పరీక్షలకు మళ్లీ ఫీజ్ కట్టక్కర్లేదు.. కేటీఆర్

**ప్రజాతపన ,హైదరాబాద్ :**

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్‌పై మంత్రి కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీక్‌పై నిపుణులతో చర్చించామని, సీఎం కేసీఆర్ ఆదేశాలతో రివ్యూ చేశామని తెలిపారు. పేపర్ లీక్‌పై కేసీఆర్‌కు నివేదిక ఇచ్చామని, ద్వారా 155 నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పారు. ద్వారా 37 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 10 లక్షల మందికి ఒకేసారి పరీక్ష నిర్వహించిన ఘనత ఉందని చెప్పుకొచ్చారు. ఇద్దరు చేసిన తప్పునకు మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వచ్చిందని, పేపర్ లీకేజీ వెనుక ఎంతటివారున్నా వదిలిపెట్టేది లేదని మంత్రి కేటీఆర్ తేల్చి చెప్పారు. రద్దయిన పరీక్షలకు మళ్లీ ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇకపై జరిగే పరీక్షలను మరింత పటిష్టంగా నిర్వహిస్తామని

(మిగతా 2లో)

## జులై నుంచి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్



**ప్రజాతపన ,ఏలూరు:**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని ఈ ఏడాది జులైలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.డ్యామ్ డిజైన్ రివ్యూ కమిటీ తాజా డిజైన్లకు అమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. దీంతో జులైలో పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో వరుసగా రెండు సీజన్లలో పనులు నిలిచిపోయాయి.మరోవైపు గోదావరి వరద ప్రవాహంతో కోతకు గురైన ప్రాంతాన్ని ఇసుకతో నింపే పనులు పూర్తి చేసే పనులు ప్రారంభించనున్నారు. డయాఫ్రం వాల్ నిర్మించిన ప్రాంతంలో పెద్దఎత్తున అగాథాలు ఏర్పడటంతో వాటిలో ఇసుక నింపి దానిని వైబ్రో కాంపషన్ పద్ధతిలో గట్టి పరిచే పనులు చేపట్టనున్నారు. గోదావరి వరదల్లో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిన చోట పెద్ద ఎత్తున ఏర్పడిన అగాథాలను వేగంగా పూడ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ నిపుణులు డయాఫ్రం వాల్ సామర్థ్యంపై ఇప్పటికే నివేదిక సమర్పించడంతో దానికి అనుగుణంగా పనులు చేపట్టనున్నారు. 1400మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రం వాల్‌లో దాదాపు 700మీటర్ల పొడవున వేర్వేరు ప్రాంతాల్లో దెబ్బతింది. వీటిని సరిచేయాల్సి ఉందని గుర్తించారు. రెండు భాగాలుగా డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో వాటిని సరిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాల్లో డి వాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. కోతకు గురైన రెండు భాగాల్లో డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా డి వాల్ నిర్మాణం చేపడతారు.డయాఫ్రం వాల్ మరమ్మతులు సాగుతున్న

(మిగతా 2లో)

ప్రజా తపన
prajathapana.com
News that matters

# వారానికి రెండు రోజులు మిల్లెట్స్

(మొదటిపేజీ తరువాయి)

వారికి సముచిత గౌరవం తెచ్చి పెడుతుంది. తద్వారాగ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఈ సాగు పెరిగితే కొత్త ఉద్యోగాలు కూడా పుట్టుకొస్తాయి.”
కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కూడా పాల్గొన్నారు. శ్రీ అన్న పథకానికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుందని స్పష్టం చేశారు. దాదాపు 100 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మరి కొందరు వర్చువల్‌గా పాల్గొననున్నారు. 2021 మార్చి 5వ తేదీన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2023 ని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్‌గా ప్రకటించింది. భారత్ ప్రతిపాదనకు గౌరవమిస్తూ ఈ ప్రకటన చేసింది. తృణధాన్యాల ద్వారా పోషకాహార లోపాన్ని జయించవచ్చని చెబుతోంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యాన్ని అందించే పంటలపై ఆసక్తి పెరిగింది. రాగులు, సజ్జలు, అరికెలు, ఊదల వంటి తృణధాన్యాలు తిన్న తర్వాత మెల్లగా గ్లూకోస్‌ను విడుదల చేసే సంగతి తెలిసిందే. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతున్నాయి. డయాబెటిస్ ముప్పు తగ్గుతోంది. భారతీయుల ఆరోగ్యంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు భారత్‌కు అవకాశం దొరికింది. అందుకే ఐక్య రాజ్య సమితితో ఈ ఏడాదిని ‘తృణధాన్యాల సంవత్సరం’గా ప్రకటించేలా పావులు కదిపారు. టాటా కన్జూమర్స్, ఐటీసీ వంటి బ్రాండ్లు తృణధాన్యాల ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. తృణధాన్యాలతో ఇడ్లీరవ్వ, ఉప్మా రవ్వా, దోసె పిండి, బిస్కెట్లు ఉత్పత్తి చేస్తున్నాయి. పైగా ఐటీసీ తమ హోటళ్లలో తృణధాన్యాల భోజనాలను ప్రవేశపెట్టబోతోందని తెలిసింది. చిరు ధాన్యాలు తినడం వల్ల రక్తంలో గ్లూకోజు స్థాయిలు 12-15 శాతం తగ్గుతాయి! అలాగే ఒక కిలో ధాన్యాలను పండించేందుకు 650-1200 లీటర్ల నీరు సరిపోతుంది. అదే ఒక కిలో బియ్యానికి 5000 లీటర్ల నీరు అవసరం. పైగా విటమిన్లు, ఖనిజాలు దేహానికి లభిస్తాయి. వివిధ సూక్ష్మపోషకాలు దొరుకుతాయి.

# భయపెడుతున్న కరోనా

(మొదటిపేజీ తరువాయి)



శాఖ అధికారులకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ లేఖలు రాశారు.తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ వరకు 132 కేసులు నమోదు కాగా, మార్చి 15వ తేదీ నాటికి వాటి సంఖ్య 267కి పెరిగినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీకి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. ఈ నెల రెండో వారంలో పాజిటివిటీ రేటు 0.31 శాతానికి చేరిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొవిడ్ వైరస్ వ్యాప్తి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆరోగ్య శాఖను ఆదేశించారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ మధ్యలో దేశవ్యాప్తంగా 2,082 నుంచి 3,254కి కేసులు పెరిగాయని తెలిపారు. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలను కూడా కేంద్రం ఇదే విధంగా అప్రమత్తం చేసింది.వైరస్ కట్టడికి చర్యలు తీసుకోవాలని సూచించిన రాజేష్ భూషణ్.. అకస్మాత్తుగా కేసులు ఎందుకు పెరుగుతున్నాయో దృష్టిసారించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా టెస్ట్, ట్రాక్, ట్రీట్, వ్యాక్సినేషన్ విధానాన్ని కచ్చితంగా అమలుచేయాలని స్పష్టంచేశ్శారు. ఇన్‌ఫ్లుయెంజా, తీవ్ర శ్వాసకోశ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న వారిపై దృష్టి సారించి, పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. వైరస్‌ను ప్రాథమిక స్థాయిలోనే అదుపు చేసేందుకు ప్రత్యేక నిఘా ఉంచాలని.. అంతర్జాతీయ ప్రయాణికులు, గుర్తించిన ఆస్పత్రులు, స్థానిక క్లస్టర్లలో నమోదైన కేసులకు సంబంధించిన నమూనాలను జన్యు విశ్లేషణకు పంపాలని ఆదేశించారు. అర్హులైన వారందరూ బూస్టర్ డోస్ తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.తెలంగాణలో ఒక్కరోజే కొత్తగా 27 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌లో 12 కేసులు నమోదు కాగా, సంగారెడ్డి జిల్లాలో రెండు, మిగిలిన 13 కేసులు 13 జిల్లాల్లో నమోదయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 281 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ నెల 10 నుంచి 16వ తేదీ మధ్య హైదరాబాద్‌లో అత్యధిక కేసులు నమోదయ్యాయి. మరోవైపు.. గత ఏడాది నవంబరు 12వ తేదీన దేశవ్యాప్తంగా 734 కేసులు నమోదుకాగా.. నాలుగు నెలల విరామం తర్వాత మళ్లీ గురువారం కొత్తగా నమోదైన కేసుల సంఖ్య 700 దాటింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై... ఎక్కువ కేసులు నమోదవుతున్న రాష్ట్రాలను హెచ్చరించింది.దేశంలో తొలి కరోనా కేసు గుర్తించి మూడేళ్లు దాటింది. మహమ్మారి తగ్గుముఖం పట్టి సాధారణ వాతావరణం నెలకొందని భావిస్తున్న తరుణంలో కొత్త వేరియంట్ తో పాటు ఇన్‌ఫ్లూయెంజా కేసులు దడ పుట్టిస్తున్నాయి. భారత్‌లో తాజాగా కరోనా కొత్త వేరియంట్ చీః 1.16 వెలుగుచూడటం కలవరపాటుకు గురి చేస్తోంది.అత్యంత వేగంగా వ్యాపించే ఈ ఎక్స్‌బీబీ రకం వేరియంట్‌ను ఇప్పటికే చాలా దేశాల్లో గుర్తించారు. అయితే రాబోయే రోజుల్లో కరోనా కేసుల పెరుగుదలకు ఈ వేరియంటే కారణం కావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# జనసేన సభపై బీజేపీ ఆరా

**న్యూఢిల్లీ:**



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈ నెల 14న భారీ ఎత్తున జరిగింది. పెద్ద ఎత్తున అభిమానులు తరలి వచ్చి పవన్‌కు మద్దతు తెలిపారు. మచిలీపట్టణంలో నిర్వహించిన సభలో జనం ఊహించిన దాని కన్నా ఎక్కువగానే వచ్చారు. ప్రధానంగా జనసేన అదినేత పవన్ కల్యాణ్ విజయవాడ నుంచి నిర్వహించిన రోడ్ షోకు మరింత క్రేజ్ వచ్చింది. రాజకీయంగా నిర్వహించిన రోడ్‌లో అభిమానులు, పెద్ద ఎత్తున తరలివచ్చారు. అదే సందర్భంలో మహిళలు సైతం రోడ్ షోలో ఉత్సాహంగా పవన్‌ను చూసేందుకు వచ్చారు. దీంతో జనసేన వీరమహిళల్లో ఉత్సాహం కనిపించింది. విజయవాడ నుంచి మచిలీపట్టణం సభ వేదిక వరకు జనం పవన్ ను ఫాలో అవుతూనే ఉన్నారు. పవన్ నిర్వహించిన రోడ్ షో, మచిలీపట్టణంలో సభ ముగింపు వరకు అన్నింటిని పూర్తి వివరాలతో కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకులు వివరాలను తీసుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే భారతీయ జనతా పార్టీ, జనసేన పొత్తులో ఉన్నవేళ పవన్ నిర్వహించిన కార్యక్రమం దాని పరిణామాలు, వచ్చిన వారిలో అభిమానులు, ఓటర్లు శాతం ఏంటి అనే వివరాలను కూడా నిఘా వర్గాల ద్వార భారతీయ జనతా పార్టీలోని పెద్దలు ఆరా తీసినట్లుగా చెబుతున్నారు..
భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ నేతలపై ఆవిర్భావ దినోత్సవ సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని పెద్దలతో సంప్రదింపులు జరిపి, కార్యక్రమాలను రూపొందిస్తే, రాష్ట్రంలోని నేతలు ముందుకు రావటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయటంతో భారతీయ జనతా పార్టీకి చెందిన నేతల్లో కూడా చర్చ జరిగింది. పవన్ ఇలా మాట్లాడటానికి గల కారణాలు ఏంటనే దానిపై పార్టీ నేతల్లో కూడా వివిద రూపాల్లో చర్చ జరుగుతుంది. ఈ పరిణామాలపై కూడా రాష్ట్ర నాయకత్వం నుంచి కేంద్రంలోని పెద్దలు వివరాలు అడిగారని అంటున్నారు..భారతీయ జనతా పార్టీ జనసేనతో పొత్తు కొనసాగుతున్నప్పటికి, ఇరు పార్టీలకు చెందిన నేతల మధ్య సమన్వయం లేకపోయిందని స్వయంగా పవన్ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఏం చేయాలనే దానిపై క్లారిటి లేకుండా పోయిందన్నారు. ఇప్పటంలో నిర్వహించిన 9వ ఆవిర్బావ సభలో కూడా పవన్ భారతీయ జనతా పార్టీకి చెందిన కేంద్ర నాయకత్వాన్ని రోడ్ మ్యాప్ ఇవ్వాలని బాహాటంగానే అడిగారు. అయినా ఆ పార్టీ నేతల నుంచి భిన్నాభిప్రాయాలు వచ్చాయి. పవన్ నేరుగా విశాఖపట్టణం వేదిగా ప్రదానితో సమావేశం అయ్యారు. తర్వాత ఇప్పటి వరకు వరకు ఇరు పార్టీలకు చెందిన నాయకులు మధ్య సంప్రదింపులు జరిగినట్లుగా ఎక్కడా కనిపించిన దాఖాలు లేవు. వీటన్నింటికి మించి పార్టీకి రాజీనామా చేయకముందు కన్నా లక్ష్మినారాయణ కూడా పవన్‌ను బీజేపి సరిగ్గా వాడుకోవటం లేదని, అది రాష్ట్ర నాయకత్వం వైఫల్యమని కామెంట్ చేశారు. దీంతో పార్టీ నేతల్లో ఇప్పటికి అదే చర్చ జరుగుతుంది. పవన్‌ను సరైన రీతిలో వాడుకొని ఉంటే, ఇప్పటికే బీజేపి ఆంధ్రప్రదేశ్‌లో బలబడి ఉండేదని పార్టీ నేతల్లో అభిప్రాయం ఉన్నప్పటికి, రాష్ట్ర నాయకత్వంలోని మరి కొందరు నేతలు ఆ దిశగా అడుగులు పడకుండా, అడ్డుతగులుతున్నారా...అనే అనుమానాలు సైతం పార్టీ నేతల్లో వ్యక్తం అవుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది

# సరిహద్దుల్లో ప్రశాంతంగానే ఉంది

(మొదటిపేజీ తరువాయి)

ఆ సంఖ్యను తగ్గించే ఉద్దేశమూ లేదు. అవసరాలకు తగ్గట్టుగా సైన్యంలో మార్పులు చేర్పులు చేస్తున్నాం. ముఖ్యంగా ఒంఅ వద్ద మొహరించిన సైన్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం”

ఈ సరిహద్దు ప్రాంతంలో మౌలిక వసతుల నిర్మాణాలు కూడా చాలా వేగంగా పూర్తవుతున్నాయని చెప్పారు మనోజ్ పాండే. ఎయిర్‌ఫీల్డ్‌లు, హెలిప్యాడ్‌లను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు వివరించారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోడానికి సరిపడ సామర్థ్యం ఉందని తేల్చి చెప్పారు. “ప్రస్తుతం నెలకొన్న వివాదాన్ని మిలిటరీ కమాండర్ స్థాయిలో చర్చలు జరిపి పరిష్కరించుకోవచ్చు. గతేడాది డిసెంబర్‌లో ఓ సారి ఈ చర్చలు జరిగాయి. ఇక దౌత్యవేత్తల సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి”

**- మనోజ్ పాండే, ఆర్మీ చీఫ్**

ఎప్పుడు చైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఇటు భారత్ మాత్రం యుద్ధ వాతావరణమే వస్తే దీటుగా బదులిస్తామని గట్టిగా చెబుతోంది. ఈ క్రమంలోనే యూఎస్ ఇంటిలిజెన్స్ రిపోర్ట్ కీలకంగా మారింది. భారత్, చైనా మధ్య పరిస్థితులు అదుపు తప్పితే అమెరికా జోక్యం చేసుకుంటుందని తేల్చి చెప్పింది. ంనినిబీజీశ్రీ ఞష్ట్రతీవజీబి ంబబవబబఎవనిబి పేరిట ఈ రిపోర్ట్‌ను విడుదల చేసింది అమెరికా జాతీయ నిఘా విభాగం. ఆ రెండు దేశాల మధ్య ఎన్నాళ్ళుగానో కొనసాగుతున్న సరిహద్దు వివాదం గురించి ప్రస్తావించింది. “భారత్, చైనా మధ్య సరిహద్దు వివాద పరిష్కారానికి చర్చలు జరుగుతున్నాయి. కానీ 2020లో జరిగిన ఘర్షణను దృష్టిలో పెట్టుకుని నిశితంగా గమనిస్తున్నాం. అణ్వస్త్రాలున్న రెండు దేశాల మధ్య ఏ కాస్త పరిస్థితులు అదుపు తప్పినా అది అమెరికాకు కూడా చేటు చేస్తుంది. అలాంటి సమయంలో అమెరికా జోక్యం చేసుకోక తప్పదు. క్రమంగా ఈ రెండు దేశాల మధ్య ఘర్షణ ముదిరేలా కనిపిస్తోంది”

**- అమెరికా నిఘా విభాగం**

అమెరికా తమ ప్రజల్ని కాపాడుకునేందుకే ప్రాధాన్యతనిస్తుందని ఈ రిపోర్ట్‌లో తేల్చి చెప్పింది ఇంటిలిజెన్స్. అటు భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న వివాదాన్నీ ప్రస్తావించింది. కశ్మీర్‌లో ఉగ్రదాడులు విపరీతంగా పెరిగిపోయే ప్రమాదముందని హెచ్చరించింది. ఈ సంక్షోభం ఇంకా ముదిరే అవకాశముందని అంచనా వేసింది. అయితే..యాంటీ ఇండియా మిలిటరీ గ్రూప్స్‌కు పాకిస్థాన్ మద్దతునిస్తోందని, కానీ మోదీ పాలనలో ఎలాంటి దాడులకు పాల్పడాలని చూసినా...ఎదురు దాడులు తప్పవని స్పష్టం చేసింది.

# రద్దయిన పరీక్షలకు మళ్లీ ఫీజ్ కట్టక్కర్లేదు.. కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. గతంలో హాజరైన వారిని అర్హులుగా గుర్తిస్తామని, కోచింగ్ మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు.నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామని, 2 లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని కేటీఆర్ ప్రకటించారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అపోహలు సృష్టించేవారిని నమ్మొద్దని మంత్రి కేటీఆర్ తెలంగాణ యువతకు సూచించారు. ఇదిలా ఉండగా.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసు నిందితులను సిట్ కస్టడీకి అప్పగించారు. 9 మంది నిందితులను 6 రోజుల కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది.చంచల్‌గూడ జైలు నుంచి నిందితులను సిట్ అదుపులోకి తీసుకుంది. పేపర్ లీక్ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలపై సిట్ కూపీ లాగనుంది. ప్రశ్నాపత్రం ఎవరెవ్వరికి విక్రయించారనే దానిపై సిట్ ఆరా తీయనుంది. నిందితులను మార్చి 23 వరకు సిట్ అధికారులు విచారణ చేయనున్నారు.


# అస్సాం రాష్ట్రంలోని జిల్లాల స్వచ్ఛతాపోటీలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించనున్నారు. జిల్లా అభివృద్ధి కోసం ఆ నిధులు ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. అంతేకాదు ఖుమ్‌తాయి నియోజకవర్గంలోని జడ్‌పీసీ ప్రాంతంలోని గ్రామాల మధ్య, టీ గార్డెన్‌ల మధ్య కూడా స్వచ్ఛతకు సంబంధించిన పోటీ ప్రకటించారు. ఈ పోటీల ద్వారా అస్సాం దేశంలోనే అత్యంత పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్వచ్ఛతా పోటీలపై బ్లూ ప్రింట్ కూడా విడుదల చేయనున్నారు. స్వచ్ఛతా పోటీల ద్వారా పర్యాటకంగా కూడా తమ రాష్ట్రానికి మేలు చేకూరుతుందని శర్మ చెబుతున్నారు.2014లో కేంద్రంలో అధికారం లోకి వచ్చాక ప్రధానమంత్రి నరేంద్ర మోదీస్వచ్ఛ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటికే రాష్ట్రాల మధ్య, నగరాల పోటీ పెట్టి పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్నారు. స్వచ్ఛభారత్ ఉద్యమంపై అన్ని రాష్ట్రాల్లోనూ అవగాహన పెరిగింది.

# జూలై నుంచి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్

(మొదటిపేజీ తరువాయి)



సమయంలో ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతో భారీ వరదలు వచ్చినా ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అంచనా వేస్తున్నారు. గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లిస్తే మట్టి కట్ట నిర్మాణానికి ఎలాంటి అటంకాలు ఉండవని అంచనా వేస్తున్నారు. జూన్ నుంచి గోదావరిలో వరద ప్రవాహం మొదలైన పనులకు ఎలాంటి అటంకం ఉండదని భావిస్తున్నారు.అన్ని అనుకూలిస్తే జులైలో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ప్రారంభం కానున్నాయి. డయాఫ్రం వాల్ నిర్మాణం జరిగిన గ్యాప్ వన్ ప్రాంతంలో ఈ పనులు చేపడతారు. ప్రస్తుతం పోలవరంలో నిర్మాణ పనులను చేపట్టడానికి ఎలాంటి ఇబ్బందులు లేనందున పనుల్ని నిరంతరం కొనసాగించవచ్చని భావిస్తున్నారు. కాఫర్ డ్యామ్‌లు ఉండటంతో మట్టికట్టను నిరంతరాయంగా నిర్మించవచ్చని చెబుతున్నారు. భారీ ఎత్తున వరద ప్రవాహం వచ్చిన కాఫర్ డ్యామ్‌ల మధ్య ఉన్న నీటిని తొలగించడం పెద్ద ఇబ్బంది కాదని పోలవరం అధికారులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున వరద ప్రవాహం వచ్చినా దాని ప్రభావం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని భావిస్తున్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌తో పాటు డయాఫ్రం వాల్ మరమ్మతులు సమాంతరంగా చేపట్టనున్నారు.పోలవరం ఆనకట్ట నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే నిర్దిష్ట గడువేది లేకపోయినా 2024లోపు గ్రావిటీ మీద నీళ్లు అందించాలనే లక్ష్యం మాత్రం విధించుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు ఏడాది కావడంతో వీలైనంత త్వరగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మట్టికట్ట నిర్మాణం జరిగే గ్యాప్1లో పనుల్ని జులైలో ప్రారంభించనున్నట్లు పోలవరం ఎస్ఈ నరసింహమూర్తి తెలిపారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఏకకాలంలో అన్ని పనులు చేపట్టేందుకు అనువైన వాతావరణం ప్రస్తుతం పోలవరంలో ఉందని చెబుతున్నారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయనే విషయంలో మాత్రం ఖచ్చితంగా డెడ్‌లైన్ ఉండదని, అందుకు సాంకేతిక అంశాలతో పాటు ప్రకృతి సహకారం కూడా అవసరమని భావిస్తున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# వైసీపికి డేంజర్ బెల్స్

**విజయవాడ :**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ రాజకీయవర్గాలు చాలా ఆసక్తిగా ఎదురు చూశాయి. దీనికి కారణం ప్రజా నాడి ఎలా ఉందో నేరుగా ఓట్ల రూపంలో తెలుసుకునే ఓ అవకాశం రావడమే. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయా పార్టీల ఓటర్లు ఓట్లు వేస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు చాలా పరిమితం. కానీ పట్టభద్రుల ఓటర్లు మాత్రం లక్షల్లో ఉంటారు. మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి దాదాపుగా పది లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రజాభిప్రాయాన్ని ఓ రకంగా అంచనా వేయవచ్చు. అందుకే అందరూ ఈ ఫలితాలపై ఆసక్తిగా ఎదురు చూశారు. చివరికి వైఎస్ఆర్‌సీపీకి షాక్ తగిలింది. రెండు స్థానాల్లో అసలు పోటీ ఇవ్వలేకపోగా కంచుకోట లాంటి స్థానంలో తామే గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చింది. అన్ని చోట్లా గెలుస్తామని కేబినెట్ భేటీలో ముందస్తుగానే మంత్రుల్ని సీఎం జగన్ అభినందించారు. కానీ జరిగింది మాత్రం వేరు. ఉత్తరాంధ్రపై ఈ సారి వైఎస్ఆర్‌సీపీ చాలా ఎక్కువ ఆశలు పెట్టుకుంది. దానికి కారణం తాము రాజధానిని విశాఖ తీసుకు వస్తున్నామని అక్కడి ప్రజలు తమకు బ్రహ్మరథం పడతారని అనుకోవడమే. అలా అని ఊరుకోలేదు. ఆరు నెలల ముందుగానే అభ్యర్థిని ప్రకటించారు. ఓట్ల నమోదు దగ్గర్నుంచి అన్ని విషయాల్లోనూ కేర్ తీసుకుంది. చివరికి ప్రచారంలోనూ మంత్రులు అంతా తామై వ్యవహరించారు. మంత్రి ధర్మాన ఎక్కడ పట్టభద్రుల ఎన్నికల మీటింగ్ పెట్టినా... వైఎస్ఆర్‌సీపీకి ఓటేయకపోతే విశాఖ రాజధాని డిమాండ్‌ను బలహీనపర్చడమేనని సెంటిమెంట్ వాడే ప్రయత్నం చేశారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా పట్టభద్రులైన ఓటర్లు మాత్రం పట్టించుకోలేదు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావుకే భారీ మెజార్టీ ఇచ్చారు. నిజానికి తెలుగుదేశం పార్టీ ఇక్కడ మొదట గాడు చిన్నికుమారి అనే నేతను అభ్యర్థిగా ప్రకటించింది. కానీ ఆమె బలహీన అభ్యర్థి అని నిర్ణయించుకుని ఫిబ్రవరిలోనే అభ్యర్థిగా ఎకానమీ చిరంజీవిగా ఎంతో మంది గ్రాడ్యుయేట్లకు పరిచయమున్న వేపాడ చిరంజీవి రావును అభ్యర్థిగా ఖరారు చేశారు. ఆయన ఇతర టీడీపీ నేతల కృషితో విస్తృతంగా పర్యటించారు. మంచి ఫలితం సాధించారు. వైఎస్ఆర్‌సీపీ గెలుపొందడటానికి చేయని ప్రయత్నాలు లేవు. వెండి బిస్కెట్లు పంచారని కూడా ఆరోపణలు వచ్చాయి. ఇక విజయసాయిరెడ్డి నుంచి ఉత్తరాంధ్ర బాద్యతలు తీసుకున్న వైవీ సుబ్బారెడ్డి మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎమ్మెల్సీ ఓడిపోతే రాజధాని వాదన బలహీనపడుతుందన్న అభిప్రాయంతో చేయాల్సినంత చేశారు. కానీ.. ఫలితం ఏ మాత్రం అనుకూలంగా రాలే?దు. ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీకి ఈ అంశంపై సమీక్ష చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ఎందుకంటే.. అమరావతిని కాదని అక్కడ వ్యతిరేకత మూట గట్టుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు విశాఖలో కూడా సానుకూలత లేకపోతే రెంటికి చెడ్డ రేవడి అయిపోతుంది పరిస్థితి. వైఎస్ఆర్‌సీపీ తన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యూహంలో మార్పులు చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక తెచ్చి పెట్టిందనుకోవచ్చు. ఒక్క ఉత్తరాంధ్రలోనే కాదు తూర్పు రాయలసీమలోనూ వైఎస్ఆర్‌సీపీకి గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పరిధిలోని గ్రాడ్యుయేట్ ఓటర్లు పూర్తి స్థాయిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ కు మద్దతుగా నిలిచారు. నిజానికి నెల్లూరు వైఎస్ఆర్‌సీపీ కంచుకోట. చిత్తూరులో అయితే పెద్దిరెడ్డి లాంటి నేత ఉన్నారు. ఆయన ఏ ఎన్నిక జరిగినా పట్టు బిగిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోనూ మెజార్టీ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలే. పైగా మూడు రాజధానుల పేరుతో తిరుపితలోనూ గర్జన నిర్వహించారు. అయితే ఇక్కడ కూడా వైఎస్ఆర్సీపీకి ఇబ్బందికర పరిస్థితులు తప్పలేదు. రాజధానిగా విశాఖ వాదనకు.. తూర్పురాయలసీమ ప్రజలు కూడా సంతృప్తిగా లేరు. అమరావతి అయితే సమీపంలోనే ఉంటుందని.. విశాఖ అయితే ఎలా ఉన్న అభిప్రాయం సామాన్య జనాల్లో ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ప్రకాశం , నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. వెలిగొండ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టిన జగన్ ప్రభుత్వం తాము వచ్చాక జరుగుతున్న పనుల్ని నిలిపివేసి.. రివర్స్ టెండరింగ్ ద్వారా ఇతరులకు పనులు ఇచ్చారు కానీ అసలు ముందుకు సాగలేదు. ఇలాంటివి మూడు జిల్లాల్లో ఉన్నాయి. అదే సమయంలో నిరుద్యోగ సమస్య కూడా యువతను ఆలోచింప చేసినట్లుగా అనుకోవచ్చు. అందుకే.. గట్టి పట్టు ఉన్న ప్రాంతంగా పేరున్న జిల్లాల్లోనూ వైఎస్ఆర్‌సీపీకి ఎదురు గాలి వీచిందని నమ్ముతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఈ సమస్యలపై సమీక్ష చేసి.. పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితుల్ని గ్రాడ్యుయేట్లు తమ ఓటింగ్ ద్వారా గుర్తు చేశారని అనుకోవచ్చు. పశ్చిమరాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఉన్న జిల్లాలు కడప, కర్నూలు, అనంతపురం. ఈ మూడు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ పట్టు గురించి చెప్పాల్సిన పని లేదు. మూడు జిల్లాలకు కలిపి టీడీపీకి ఉన్నది ఇద్దరే ఇద్దరు ఎమ్మెల్యేలు. వారు కూడా అనంతపురం జిల్లా నుంచే ఉన్నారు. అంటే ఏకపక్షంగా పట్టభద్రులు ఓటింగ్ చేయాల్సిన నియోజకవర్గం. కానీ హోరాహోరీ పోరు జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గట్టి పోటీ చేస్తున్నారు. అన్ని రౌండ్లలోనూ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థికి మెజార్టీ వచ్చినప్పటికి అది డబుల్ డిజిట్స్ లోనే ఉంటుంది. అందుకే ఓవరాల్ మెజార్టీ రెండు వేలకు దాటడం లేదు. పీడీఎఫ్ అభ్యర్థులతో టీడీపీ వచ్చిన అవగాహన మేరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లు.. టీడీపీ అభ్యర్థికి వేసిఉంటే.. ఇక్కడ వైఎస్ఆర్‌సీపీ షాక్ తినొచ్చు. అదే జరిగితే.. వైఎస్ఆర్‌సీపీ కంచుకోట కూలినట్లవుతుంది. అది వైఎస్ఆర్‌సీపీ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తాము ప్రజా రంజకంగా పరిపాలిస్తున్నామన్న ఓ రకమైన అభిప్రాయంలో ఉంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తెలుసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదని తాజా ఎమ్మెల్సీ పరిణామాలతో అర్థమైపోతుంది. ఇప్పటి వరకూ ప్రత్యక్షంగా జరిగిన ఎన్నికల్లో ఇలాంటి అనుభవం ఎదురు కాలేదు కాబట్టి.. అలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని అనుకోవచ్చు. మరి ఇప్పుడైనా ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్‌గా ఉంటుందా అన్నది ఆసక్తికర అంశం. ప్రత్యర్థులపై రాజకీయ దాడులు ఆపి ప్రజలకు అత్యధిక సమయం కేటాయించాలన్న విశ్లేషణ ఎక్కువగా వినిపిస్తోంది. ఎందుకంటే రాజకీయ ప్రత్యర్థుల్ని టార్గెట్ చేస్తే.. అది వారికి బలం ఇస్తుంది. కానీ టార్గెట్ చేసిన వారికి మైనస్ అవుతుంది. ఎన్నికలకు ఇంకా ఏడాది కూడా లేని సమయంలో.. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సమీక్షించుకుని.. లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాల్సిన అవసరం అధికార పార్టీపై పడిందని అనుకోవచ్చు.

## వివేకా దర్యాప్తు కేసులో జాప్యం ఎందుకు..

**కడప:**

వివేకా హత్య కేసు దర్యాప్తు జగుతున్న తీరు..చేరుకుంటున్న ముగింపు దిశ చూస్తే.. ఈ కేసులో సూత్ర ధారులు, పాత్రధారుల పాత్ర అతి తొందరలోనే వెల్లడయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ఎవరైనా భావిస్తారు. ఈ పరిస్థితుల్లో కేసు దర్యాప్తును అడ్డుకోవడానికి ఎవరు ఏ విధంగా ప్రయత్నించినా.. వారిపై అనుమానాలు వెల్లువెత్తడం ఖాయం.సరిగ్గా అదే జరుగుతోంది ఇప్పుడు వివేకా హత్య కేసు విషయంలో ఈ కేసు దర్యాప్తు సజావుగా సాగకుండా సాధ్యమైనంత వరకూ జాప్యం జరిగేలా చూడటమే లక్ష్యంగా జరుగుతున్న ప్రయత్నాలు అటువంటి అనుమానాలకే ఆస్కారం కలిగిస్తున్నాయి. అలా ప్రయత్నిస్తు న్నవారే ఈ కేసులో దోషులు అన్న నిర్ధారణకు జనం వచ్చేందుకు ఆ ప్రయత్నాలే ఆస్కారం కలిగిస్తున్నాయి.టెక్నికల్ గా కేసులు, పిటిషన్లతో దర్యాప్తు ముందుకు సాగకుండా అడ్డుకుంటూ.. జనం దృష్టిలో పలుచన అవ్వడమే కాకుండా.. నేరం చేసినట్లుగా ప్రజలు నమ్మడానికి వారి ప్రయత్నాలు ఆస్కారం కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా ప్రస్తుతం సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వేసిన పిటిషన్లు చాలవా అన్నట్లు.. హతుడు వైఎస్ వివేకా వద్ద పిఏగా పని చేసిన కృష్ణారెడ్డి కూడా హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆయన తన పిటిషన్ లో వైఎస్ వివేకా హత్య ఆస్తుల కోసమే జరిగి ఉంటుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యూహమే జగన్ అక్రమా స్తుల కేసు విషయంలోనూ అనుసరిం చిన విషయాన్ని ఈ సందర్భంగా పరిశీల కులు గుర్తు చేస్తున్నారు. ఒకరి తరువాత ఒకరు అన్నట్లుగా పెద్ద సంఖ్యలో కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తూ కేసు దర్యాప్తు, విచారణ ముందుకు సాగకుండా అడ్డుకోవడమే లక్ష్యం అన్నట్లుగా సాగుతోంది.

## అరకొర సేవలతో సర్కారీ ఆసుపత్రి

**రాజమండ్రి:**

సాధారణంగా ప్రభుత్వాసుపత్రి అంటే అంతా ఫ్రీగా జరుగుతాయని అనుకుంటారు. కానీ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. చాలీచాలని మందులు, అరకొర సేవలతో పేదలు అల్లాడిపోతున్నారు. దాదాపుగా మందులన్నీ రోగులు బయట కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సర్జరీ చేయించుకోవడానికి ఎవరైనా వస్తే అందుకు అవసరమైన సామాగ్రి అంతా రోగి కుటంబీకులు తెచ్చుకోవాల్సిందే. పిఠాపురం పట్టణంతోపాటు, దాదాపుగా చుట్టుకపక్కల ఉన్న 10 గ్రామాలకు ఇదే పెద్దాసుపత్రి .పిఠాపురం, పెద్దాపురం పురపాలక సంఘాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా వీటి పరిధిలో జాతీయ రహదారులు ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయి. బాధితులకు అత్యవసర చికిత్స అందించాల్సి ఉన్నా, 108 వాహనం రాకపోతే ఇక నరకమే. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వ అంబులెన్సులు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అందుబాటులో ఉంచారు. ఈ వాహనాలకు గతంలో డ్రైవర్లను కూడా నియమించారు. కానీ సదరు వాహనం మూలకు చేరడంతో సమస్య మొదటికొచ్చింది. పిఠాపురం పరిసర ప్రాంతంలో పెద్ద ప్రమాదంతో జరిగితే ఆసుపత్రి బయట ఉండే ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. పిఠాపురం నుంచి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న కాకినాడలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లాలంటే రూ. 2. వేల నుంచి రూ. 5 వేల వరకూ కిరాయి తీసుకుంటున్నారు.ప్రభుత్వం నుంచి మందులు సరఫరా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జ్వరం, గ్యాస్ట్రిక్ మాత్రలు, ఇతరనొప్పుల మాత్రలు తప్పితే, మిగతా రోగాలకు సంబంధించి అవసరమైన మందులు అందుబాటులో లేవు. చేసేది లేక వైద్యులు కొన్ని మాత్రలు బయట తీసుకోవాలని సూచిస్తున్నారు. నిరుపేదలకు మందులను బయటే కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక శస్త్రచికిత్సలకైతే అవసరమైన కిట్లు కూడా బయట తీసుకుంటున్నామని రోగులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో ఆసుపత్రి వచ్చే రోగులకు అన్ని బయట మందుల షాపులపైనే ఆధారపడాల్సి వస్తుంది. రక్తపరీక్షలను ప్రైవేటు లేబొరేటరీ లపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొని ఉంది.

# కోనసీమలో నీటి ఎద్దడి

**కాకినాడ:**



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాళ్వా పంట సాగునీరు లేక ఎండిపోతున్న పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితి డెల్టా ప్రాంతంలో మరీ దారుణంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో చాలా ఆయకట్టులోని వరిచేలు సాగునీరు అందక బీడుబారుతున్నాయి. దీంతో రైతులు అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోకపోవడంతో రైతులు నిరసన బాట పడుతున్నారు. ఈ క్రమంలోనే అమలాపురం రూరల్ మండలంలోని జనుపల్లి, వేమవరం తదితర గ్రామాల్లోని థైలాండ్ ప్రాంతంలో చేలు చాలావరకు ఎండిపోయి బీటలు వారడంతో ఆగ్రహించిన పలువురు రైతులు పొలాల్లో మోటారు సైకిళ్లు నడిపి తమ నిరసన తెలిపారు. అధికారులను ఆ ప్రాంతానికి పిలిచి చేలను చూపించి సాగునీరందక పోవడంతో నిలదీశారు. నీరు అందితే చేలు పనిచేస్తాయని పాడుచేసుకోవద్దని హితవు పలికినా రైతులు వినిపించుకోలేదు. ఇక మేము పడలేం అంటూ చేలో మోటారు సైకిళ్లు నడిపి తమ నిరసన తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గంతోపాటు, అమలాపురం గ్రామీణ మండలంలో పలు చోట్ల రైతులు ఇదే తరహా నిరసనలు చేస్తున్నారు.గోదావరి డెల్టా ప్రాంతంలో సాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈనేపథ్యంలో శివారు ప్రాంతాల్లో ఆయకట్లు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే వంతులవారీ విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అమలు చేస్తున్నారు. సెంట్రల్ డెల్టాలోని మూడు ప్రధాన పంటకాలువల ద్వారా వంతుల వారీగా సాగునీటి, తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు అధికారులు. అయితే పలుప్రాంతాల్లో డ్రెయిన్లు, పంటకాల్వలు అధ్వాన్న పరిస్థితిలో ఉండడంతో కాలువల్లో నీరు చాలాచోట్ల వృథాగా పోతోంది. ఇది గమనించిన అధికారులు యుద్ధప్రాతిపదికన 87 చోట్ల నాలుగు ప్రధాన డ్రైన్లకు క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేసి అటు సముద్రం నీరు పోటెత్తకుండా ఇటు పంటకాలవుల్లోని సాగునీరు సముద్రంలోకి వృథాగా పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ డ్రైన్లు, పంటకాలువల వ్యవస్థ దెబ్బతినడంతో చాలా సాగునీరు వృథాపోతుం దంటున్నారు. ఇదిలా ఉంటే సాగునీరు చౌర్యానికి గురవుతోంది. ఆక్వారంగం బాగా పెరిగిపోవడంతో చెరువుల్లో ఉప్పునీటి సాంద్రతను తగ్గించుకునేందుకు పంటకాలువల్లో ఇంజిన్లు పెట్టి నీటి చౌర్యాన్ని చేస్తున్నారు. దీంతో వ్యవసాయానికి సాగునీరు అక్కరకు రాకుండా పోతోంది.వాతావరణ శాఖ ప్రకటించినట్లే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చెదురుమొదురు వర్షాలు కురుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పలు చోట్ల శుక్రవారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎండిపోయిన పొలాల్లో మోటారు సైకిళ్లతో పంటను ధ్వంసం చేసుకున్న రైతులు మాత్రం తాము చేసిన పనిని సమర్థించుకుంటున్నారు.రబీ సాగుకు సాగునీటి కష్టాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. చాలా చోట్ల వరి చేలు బీటలువారుతున్నాయి. పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. నీటి కష్టాలు నివారించేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలించడంలేదు. కొన్నిరోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దాళ్వా సాగుకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలో రబీ సీజన్‌లో 1.90 లక్షల ఎకరాల్లో వరిసాగు సేద్యం చేశారు. గతంలో తొలకరి పంటను త్యాగం చేసిన రైతులు రబీ పంట సేద్యం చేస్తున్నప్పటికీ పరిస్థితులు చూస్తుంటే ఈ పంటను కూడా కోల్పోయేలా ఉందని రైతుల ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 69 గ్రామాల్లో 5287 ఎకరాల విస్తీర్ణంలో సాగునీటి సమస్యలు తలెత్తినట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటి నివారణకు సమీప ప్రాంతాల్లో డ్రైన్లపై క్రాస్‌బండ్‌లు వేసి రైతులకు సాగు నీటిని ఇంజిన్ల ద్వారా మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. అమలాపురం సబ్‌డివిజన్‌లో 63, రాజోలు సబ్‌డివిజన్‌లో 9, రామచంద్రపురం సబ్‌డివిజన్‌లో 18 క్రాస్‌బండ్‌లు ఏర్పాటుచేసి డ్రైన్లలో నీటిని ఎత్తిపోతల ద్వారా కాల్వ చిట్టచివరి భూములకు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా స్పష్టం చేశారు.

## ఏమైంది..ఈ భవనాలకు...

### దక్కన్ మాల్.. స్వప్నలోక్...

**హైదరాబాద్:**

మరో దక్కన్ మాల్‌ని తలపించింది స్వప్నలోక్ అగ్నిప్రమాదం! గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న కరెంటు ప్యానెల్ ఒక్కసారిగా పేలిపోయింది! దాంతో మంటలు చెలరేగాయి. బట్టల షాపులు ఎక్కువగా ఉండే మాల్లో అగ్నికి ఆజ్యం తోడైంది. అసలే పాత బిల్డింగ్, ఇరుకిరుకు షాపులు! ఆపై రాత్రిపూట మంటలు! ఒక భయానక వాతావరణం అలుముకుంది! ఎంజీరోడ్డు, ప్యాట్నీ సెంటరు, ప్యారడైజ్ సర్కిల్ భయంగుప్పిట్లోకి జారుకున్నాయి. ఎప్పుడూ సందడిగా ఉండే ఆ ఏరియా హాహకారాలతో దద్దరిల్లిపోయింది! మొత్తం ఎనిమిది ఫ్లోర్లున్న స్వప్నలోక్‌లో కాంప్లెక్సులో 4 ,5, 6, ఫ్లోర్లలో మంటలు చెలరేగాయి. దట్టంగా పొగలు వ్యాపించాయి. నిమిషాల్లో భవనాన్ని అగ్నికీలలు చుట్టుముట్టాయి. ప్రమాదం జరిగినప్పుడు 25 మంది చిక్కుక్కపోయారని ఫైర్ సిబ్బంది చెబుతున్నారు. శ్రీనివాస్ అనే వ్యక్తి ఫైర్ కంట్రోల్ రూమ్‌కి రాత్రి 7.30 గంటలకు కాల్ చేశాడు. అతని కాల్ ఆధారంగా హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే భవనం వెనుక నుంచి పొగలు రావడాన్ని వాళ్లు గమనించారు.మంటల తీవ్రత ఎక్కువగా ఉందని గ్రహించిన అధికారులు వెంటనే మరిన్ని వాహనాలను తీసుకురావాలని నిర్ణయించారు. 2 బ్రాంటో స్కై లిఫ్టులు, 1 సైమన్ స్నోకెల్, 1 రెస్క్యూ టెండర్‌తో సహా 12 వాహనాలను ఆగమేఘాల మీద తెప్పించారు. 10 ఫైర్ ఇంజిన్లను డెప్లాయ్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడం వల్ల దాదాపు 15 మంది ప్రాణాలతో బయటపడ్డారు. దట్టమైన పొగల వల్ల కొంతమందికి శ్వాసఆడక సొమ్మసిల్లి పడిపోయారు. కొంతమందికి సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు పోశారు. రెస్క్యూ చేసిన వారిని దగ్గర్లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి వరకు మంటలు చెలరేగుతునే ఉన్నాయి. ఘటనా స్థలం దగ్గరికి మంత్రులు తలసాని, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి చేరుకున్నారు. డీసీపీ సుమతి రెస్క్యూ పనులను పర్యవేక్షించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆమోయ్ కుమార్ అధికారులను కోఆర్డినేట్ చేశారు. అగ్ని ప్రమాదంలో రక్షించిన వారిలో కొందరిని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పరామర్శించి ధైర్యం చెప్పారు. అర్ధరాత్రి వరకు అందిన సమాచారం ప్రకారం స్వప్నలోక్ కాంప్లెక్స్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మృతులు: శివ, ప్రశాంత్, ప్రమీల, శ్రావణి, వెన్నెల, త్రివేణిగా గుర్తించారు. వీళ్లంత ఎక్కడివారు, ఏం చేస్తుంటారనేది తెలియరాలేదు. అందరూ ఐదో అంతస్తులో మంటల్లో చిక్కుకుని ప్రాణాలు విడిచారు. అదే ఫ్లోర్లో ఉన్న మరో ఏడుగురిని రెస్క్యూ చేశారు. బయటకి వచ్చిన వారు : శ్రవణ్, దయాకర్, పవన్, భారతమ్మ, గంగయ్య, రవి, సుధీర్ రెడ్డి. వీళ్లందరినీ ఫైర్ సిబ్బంది ప్రాణాలతో బయటకి తీసుకొచ్చారు. మినిస్టర్? రోడ్డులోని డెక్కన్?మాల్? అగ్నిప్రమాదం నుంచి తేరుకోకముందే సికింద్రాబాద్‌లో అలాంటిదే మరో ఘటన జరగడం జంటనగరవాసులను కలరవపెడుతోంది. దక్కన్ మాల్ ప్రమాదంలో ముగ్గురు చనిపోయారని తేల్చారు. జనవరి 20న జరిగిన ఆ ఘటన అంతులేని విషాదాన్ని మిగిల్చింది. ఐదంతస్థుల భవనం పూర్తిగా కాలిపోయింది. ఆ బిల్డింగ్ ఎందుకూ పనికిరాదని తేల్చిన తరువాత ఆ భవనాన్ని భారీ యంత్రాల సహాయంతో ఫిబ్రవరి 5న నేలమట్టం చేశారు.

## షార్ట్ సర్క్యూట్స్ స్కూల్ బస్సు దగ్ధం తప్పిన పెను ప్రమాదం

**అవనిగడ్డ**



ఎన్టీఆర్ జిల్లా కోడూరు మండల పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామంలో శనివారం ఉదయం రేపల్లెకు చెందిన శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన స్కూల్ బస్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం 7 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు సమాచారం . ఉదయం డ్రైవర్ బస్సు స్టార్ట్ చేసే సమయానికి ఒక్కసారిగా మంటలు రావడంతో డ్రైవర్ బస్సులోంచి దిగి వేసి ప్రాణాలు రక్షించుకున్నాడు. ఆ సమయంలో స్కూల్ బస్సులో విద్యార్థులు ఎవరు కూడా లేరు. హుటాహుటిన అవనిగడ్డ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పి ప్రయత్నాలు చేశారు. అప్పటికే బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. సంఘటన ప్రాంతాన్ని స్థానిక రెవిన్యూ అధికారులు పరిశీలించారు

## సైనికాధికారికి గవర్నర్ నివాళి

**హైదరాబాద్**

అరుణాచల్ ప్రదేశ్ ఎయిర్ క్రాఫ్ట్ కూలిన దుర్ఘటనలో మరణించిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్ భానురెడ్డి భౌతికదేహానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ్ సై సౌందరరాజాన్ నివాళులర్పించారు. బొమ్మలరామారంలోని వినయ్ భాను రెడ్డి నివాసంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## హైదరాబాద్లో మరో భారీ అగ్నిప్రమాదం

**రంగారెడ్డి**



నగరంలో మరో అగ్నిప్రమాద ఘటన చోటుచేసుకుంది. మైలార్దేవ్పల్లి శాస్త్రిపురంలో ఓ ప్లాస్టిక్ గోదాంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గోదాంలో ఉన్న రెండు డీసీఎం వాహనాలు దగ్ధమయ్యాయి. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది. రెండు డీసీఎంలతో పాటు గోదాంలో విలువైన సామగ్రి అగ్నికి ఆహుతయ్యింది..

## వీటీపీఎస్లో ఘోర ప్రమాదం

**ఇబ్రహీంపట్నం**



విజయవాడ థర్మల్ పవర్స్టేషన్లో లిఫ్ట్ వైరు తెగడంతో అమాంతం ఊడి కిందకు పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరికొంత మంది గాయపడ్డట్లు సమాచారం. ప్రమాద సమయంలో లిఫ్ట్లో ఎనిమిది మంది ఉన్నారు. సమాచారం అందుకున్న వీటీపీఎస్ సిబ్బంది, కార్మికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్నల్ వినయ్ భాను పార్థివ దేహంకు ఘనంగా నివాళులు అర్పించిన గ్రామస్థులు

**మేడ్చల్**



ఇటీవల హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన కల్నల్ వినయ్ భాను శనివారం అంత్యక్రియలు జరిగాయి. యాదాద్రి జిల్లా బొమ్మలరామారంలో ఆయన స్వగృహం నుంచి అంత్యక్రియలకు మల్కాజిగిరి నుండి కీసర మీదుగా పార్థివ దేహంతో వెళ్తున్న మిలటరీ వాహనాన్ని కీసర ప్రధాన కూడలిలో 5 నిమిషాలు నిలిపి గ్రామస్థులు,ప్రజా ప్రతినిధులు,యువకులు నివాళులు అర్పించారు.

# వరుస పరిణామాలతో బాస్ లో అసహనం

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఎన్నికలకు ఇంకా నెలలు మాత్రమే ఉంది. అయితే జరుగుతున్న పరిణామాలు ముఖ్యమంత్రి కేసీఆర్ కు చికాకును కలిగిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్లాల్సిన సమయంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆయన ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ లో తెలంగాణలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. మూడో సారి అధికారంలోకి వచ్చేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఒకవైపు సర్వేలు చేయిస్తూ, సిట్టింగ్ లలో ఎవరెవరికి తిరిగి సీట్లు ఇవ్వాలన్న దానిపై ఆయన కసరత్తులు చేస్తున్నారు. ముఖ్యంగా టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్గా పేరు మార్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని వివాదాలు చుట్టుముడుతున్నాయి. అవినీతి, అసమర్థత రెండు పార్టీని కమ్మేశాయి. కానీ ఆయనకు రెండు అంశాలు చేతులు కట్టేపడేసే విధంగా ముందున్నాయి. 1. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కల్వకుంట్ల కవిత ను ఈడీ విచారించడానికి సిద్ధపడటం. 2. టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీకేజీ. రెండు అంశాలు ఎన్నికలతో ముడిపడి ఉన్నవే. దీన్నుంచి బయటపడితేనే తప్ప ఆయన ప్రశాంతంగా ప్రచారాన్ని నిర్వహించలేరు. కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అసలు ఆమె ఆ స్కామ్ లో ఉన్నారా? లేదా? అన్నది న్యాయస్థానాల్లో నిర్ధారణ కావాల్సి ఉంటుంది. అయితే అప్పటి వరకూ చికాకు తప్పదు. ఒకవేళ అరెస్టయి జైలుకు వెళ్లినా ఆశించినంత సానుభూతి వస్తుందా? అన్న సంశయం కూడా గులాబాబీస్ ను వదిలపెట్టడం లేదని ఆయన సన్నిహితులే చెబుతున్నారు .అందుకే తొలుత విచారణకు భయపడేది లేదని, తెలంగాణ తలవంచదని చెప్పిన కవిత చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, ఈడీ విచారణకు హాజరు కాకపోవడం వంటివి ప్రజల్లో నెగిటివ్గా మారే అవకాశాలు లేకపోలేదన్నది బీఆర్ఎస్ నేతల అనుమానం. ఎందుకంటే ఏ అవినీతి చేయకపోతే విచారణకు ఎందుకు జడుస్తున్నారు? కవితను మాత్రమే కాకుండా పొరుగు రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడిని కూడా విచారణకు పిలుస్తున్నారు కదా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తకమానదు. ముఖ్యంగా మహిళల ఓట్లు కవిత కారణంగా కొంత జారి పోయే అవకాశముందన్న అంచనాలో కూడా గులాబీనేత ఉన్నారని సమాచారం. అయితే పూర్తి స్థాయి సర్వేలు మరొకసారి చేయిస్తే కాని అసలు విషయం తేలదు. ఇందుకు సమయం పడుతుంది.

# టీడీపీకి మంచి రోజులేనా...

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో టీడీపీ విజయం సాధించింది. మూడు పట్టభద్రులు నియోకవర్గాల్లో ఎన్నికలు జరిగితే రెండింటిని కైవశం చేసుకుంది టీడీపీ. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో కోటాకు అనుకూలంగా ఓట్ల శాతం రాకపోవడంతో.. ఎలిమినేషన్ ప్రకారం విజేతను ప్రకటించారు. ఎలిమినేషన్ రౌండ్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీ నుంచి తప్పిస్తారు. వాళ్లకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించి ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో వాళ్లకు కలుపుతారు. ఇలా రెండో ప్రాధాన్యత ఓట్లతో టీడీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం అంటే ఉమ్మడి ప్రకాశం ? నెల్లూరు ? చిత్తూరు నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయకేతనం ఎగరేశారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందారు. కంచర్ల శ్రీకాంత్ 34,108 ఓట్లతో ఘన విజయం సాధించారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు తెలుగుదేశం అభ్యర్థికి 11,511 రాగా... వైసీపీ అభ్యర్థికి 3,900 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 50%+1 ఓట్లు రావడంతో విజేతగా ప్రకటించారు. శుక్రవారం ఉదయం 8 గం.ల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై వేకువజాము వరకు కొనసాగింది. 18వ తేదీ ఉదయం 2 గంటలకు విజేతను అధికారులు ప్రకటించారు. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో తన సమీప అభ్యర్థి శ్యామ్ ప్రసాద్ రెడ్డి పేర్నాటిపై 34,110 ఓట్ల ఆధిక్యంతో కంచర్ల శ్రీకాంత్ గెలుపొందారు. ఎలిమినేషన్ కౌంటింగ్ ప్రాధాన్యతా ప్రక్రియలో మొత్తం 2,48,360 ఓట్లకు కంచర్ల శ్రీకాంత్కు 1,24,181 ఓట్లు, శ్యామ్ ప్రసాద్ పెర్నాటికి 90,071 ఓట్లు వచ్చాయి. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు వైసీపీ తరపున పోటీ చేసిన శీతంరాజు సుధాకర్ పై భారీ మెజారిటీతో గెలుపొందారు. 11,551 రెండో ప్రాధాన్యత కోటా ఓట్లను వేపాడ చిరంజీవి సాధించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దాంతో విజయానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ ను వేపాడ రెండో ప్రాధాన్యత ఓట్లతో సాధించినట్టు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెండో ప్రాధాన్యత ఓటు కీలకం గా మారింది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు లో చెల్లని ఓట్లు తొలగించగా గెలుపు కోసం 94,509 ఓట్లు అవసరం అయ్యాయి. అయితే మొదటి స్థానంలో ఉన్న చిరంజీవి రావు కూడా 83 వేల ఓట్ల పరిధిలోనే ఉండిపోవడం తో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళ్లారు అధికారులు. సీతంరాజు సుధాకర్కు 55,749 ఓట్లు రాగా, పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. అందులో తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. విజయానికి కావాల్సిన కోటా ఓట్లు 11,551 సాధించడంతో టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.వేపాడ చిరంజీవిరావు ప్రముఖ విద్యావేత్త, రచయిత, అర్థశాస్త్ర అధ్యాపకులు. తెలుగుదేశం పార్టీ తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. చిరంజీవిరావు చోడవరం నియోజకవర్గం పరిధిలోగల రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన వ్యక్తి. 2023 ఫిబ్రవరి మొదటి వారంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు కింజరాపు అచ్చం నాయుడు టీడీపీ తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావు పేరు ప్రకటించారు. వేపాడ చిరంజీవిరావు 20 ఏళ్లకుపైగా ఆర్సి రెడ్డి కోచింగ్ సెంటర్, ఇతర కాలేజీలలో ఎకానమీ లెక్చరర్గా చేస్తున్నారు.

# మెర్సీకిల్లింగ్కి అనుమతి కోరిన పాప జ్ఞానసాయిని బతికించిన చంద్ర బాబు

**అనంతపురం**

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తెని చంపుకునేందుకు అనుమతి ఇవ్వాలని 2016లో తల్లిదండ్రులు పెట్టుకున్న మెర్సీ కిల్లింగ్ పిటిషన్ గుర్తుందా? చిత్తూరు జిల్లా మొలకలచెరువు మండలం ఆర్.ఎస్.కొత్తపల్లికి చెందిన జ్ఞానసాయి అనే బాలిక కాలేయ సమస్యతో బాధపడగా, చికిత్సకి 40 లక్షలకి పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అంత స్థోమత లేని రమణప్ప డబ్బు కోసం అన్ని ప్రయత్నాలు చేశాడు. ఇక తన పాపని బతికించుకోలేనని మెర్సీ కిల్లింగ్కి అనుమతి కావాలంటూ మీడియా ద్వారా విన్నవించాడు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి సర్కారు ఖర్చుతో వైద్యం చేయించాలని ఆదేశించారు. చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేసిన 40 లక్షలతో లివర్ ట్రాన్స్ప్లాంటేషన్ చేయించి జ్ఞానసాయిని కాపాడారు. 9 నెలల వయస్సు లో ఆపరేషన్ జరిగిన తరువాత చిన్నారి జ్ఞానసాయి మందులకి, నెలనెలా పరీక్షలకి లక్షల్లో ఖర్చు కాగా టిడిపి ప్రభుత్వం సాయం అందించారు. పాప పెరిగి పెద్ద అయ్యింది. నాడు సీఎం చంద్రబాబు



చేసిన సాయంతోనే తమ పాప జ్ఞానసాయి ప్రాణాలతో నిలిచిందని లోకేష్ని కలిసి కృతజ్ఞతలు తెలియజేసింది రమణప్ప కుటుంబం. చంద్రబాబు గారు సీఎంగా ఉన్నప్పుడు కాంట్రాక్టు జాబ్ కూడా ఇప్పించారని, వైసీపీ వచ్చాక అదే జాబ్ కారణంగా తన పాప జ్ఞానసాయి, తల్లికి వచ్చే పెన్షన్లు నిలిపేశారని రమణప్ప లోకేష్ ఎదుట వాపోయాడు. ఇప్పటికీ పాప మందులకి నెలకి 20 వేలు అవుతోందని, ఇది తమకి చాలా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పార్టీ తరఫున వీలైన సాయం చేస్తామని లోకేష్ భరోసా ఇచ్చారు.

## విటిపిఎస్ లో ప్రమాదం..టీడీపీ అందోళన

**ఇబ్రహీంపట్నం**

వి టి పి ఎస్ యాజమాన్య నిర్లక్ష్య ధోరణి వలన మాత్రమే ప్రమాదం జరిగిందని, తక్షణమే వీటిపిఎస్, పవర్ మేక్ కంపెనీల అధికారులు బోర్డు హాస్పటల్ వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించాలని మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ జనసేన నాయకులు బోర్డు హాస్పిటల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు

## పోలీసు కస్టడీలో టీఎస్పీఎస్సి నిందితులు

హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పత్రాల కేసులో తొమ్మిది మంది నిందితులను పోలీసులు కస్టడీ కి తీసుకున్నారు. ఏ -1 ప్రవీణ్ కుమార్, ఏ -2 అట్ల రాజశేఖర్, ఏ -3 రేణుక రాథోడ్, ఏ -4 డాక్య, ఏ- 5 కేతావత్ రాజేశ్వర్, ఏ -6 కేతావత్ నీలేష్ నాయక్, ఏ -7 పత్లావత్ గోపాల్ నాయక్, ఏ -8 కేతావత్ శ్రీనివాస్, ఏ -9 కేతావత్ రాజేంద్ర నాయక్ లను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఇప్పటికే నిందితులపై సెక్షన్ 420, 409, 120బి, ఐటి యాక్ట్ 66 బి, సి 70 ఆఫ్ ఐటి యాక్ట్ సెక్షన్ 4 అఫ్ తెలంగాణ పబ్లిక్ ఎగ్జామ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. తొమ్మిది మంది నిందితులను ఆరు రోజుల పాటు నాంపల్లి కోర్టు కస్టడీ అనుమతి ఇచ్చింది. చంచల్ గూడా జైలు నుండి నిందితులను సిట్ బృందం కస్టడీ లోకి తీసుకున్నారు. వారిని ఆరు రోజుల పాటు విచారించునున్నారు. పోలీసులు పేపర్ లీకేజ్ వ్యవహారం లో నిందితుల ఆర్థిక లావాదేవీల పై కూపి లాగుతున్నారు. ప్రశ్న పత్రం ఎవరెవ్వరికి విక్రయించారనే దానిపై ఆరా తీస్తున్నారు.

## బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్**

ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బండి సంజయ్ కు వ్యతిరేకంగా మహిళ సంఘాల ఆధ్వర్యంలో మహిళ కమిషన్ ఎదుట నిరసనకు దిగారు. బండి సంజయ్ వెంటనే ఎమ్మెల్సీ కవితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. క్షమాపణ చెప్పకపోతే బండికి గుండు కొడుతాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఒకవేళ క్షమాపణ చెప్పకపోతే మా మహిళల పవర్ ఏంటో చూపిస్తాం అంటూ హెచ్చరించారు.

## సాయిబాబా గుడిలో సినిమా షూటింగ్

**విశాఖపట్నం**

దొర ఎంటర్టైన్మెంట్ సమ ర్పణలో ప్రొడక్షన్ నెంబర్ -1 షూటింగ్ విశాఖ కైలాసపురంలోని సాయిబాబా ఆలయంలో జరిగింది. ఈ షూటింగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హాజరై ముహూర్తపు షాట్ క్లాప్ కొట్టి ప్రారంభించారు.ఈ షూటింగ్ ఒకే షెడ్యూల్ లో ఏప్రిల్ నెలలో విశాఖ,పశ్చిమ, తూర్పు జిల్లాల్లో జరుగుతుందని దర్శక, నిర్మాత లు తెలిపారు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్లుగా వంశీ, ప్రియాంక సింగ్, కీర్తన వర్మ నటిస్తున్నారు.అదే విధంగా ఈ చిత్రానికి దర్శకత్వం రామ్ గోపాల్ రత్నం, డివోపీ రమణ, నిర్మాత హనుమంతు తుకారామ్ వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రం ఘన విజయం సాధించాలని వారు ఆకాక్షించారు.

## పోలాలగుండా గ్యాస్ పైప్ లైన్లు వద్దు

**నరసాపురం**

రైతులతో చర్చించకుండా ఓఎన్జిసి పొలాల గుండా పైప్ లైన్ నిర్మాణ పనులు చేపడితే తీవ్ర పరిణామాలు తప్పవని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలో గుర్తించిన గ్యాస్ నిక్షేపాల తరలింపులో గత రెండు రోజులుగా వైయస్ పాలెం , రుస్తుం బాధ, సీతారాంపురం గ్రామాలలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పొలాల గుండా పైప్ లైన్ పనులు చేపడితే భూములను అమ్ముకోవడానికి వీలుండదన్న ఆందోళనతో రైతు మారబోయిన సత్యనారాయణ ఈరోజు ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. దీంతో రైతులు చేపడుతున్న ఆందోళన మాజీ మంత్రి కొత్తపల్లి మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు జనసేన నాయకులు బొమ్మిడి నాయకర్ చాగంటి చిన్నాలు వైయస్ పాలెం గ్రామాన్ని సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులతో చర్చించిన తర్వాతే పనులు చేపట్టాలని మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు జనసేన నాయకులు నాయకర్ చిన్నాలు డిమాండ్ చేశారు

## మైనర్లకు వాహనాలు ఇవద్దు

**కాకినాడ**

పిల్లల పై ప్రేమతో వారు కోరిన హై స్పీడ్ బైక్లు తమ స్తోమతకు మించి కొనిస్తే., వారు రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి రోడ్డు నిబంధనలు ఉల్లంఘించడం కాకుండా ప్రాణాలు మీదకు తెచ్చుకుంటూ.. ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తున్న సందర్భంలో అనేక ఇబ్బందులు పడుతున్నారనీ కాకినాడ ట్రాఫిక్ డిఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలో రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, బైక్ రైడింగ్స్ చేస్తున్న యువతను ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్కు తరలించి., వారి తల్లిదండ్రుల సమక్షంలో వారికి కౌన్సిలింగ్ చేస్తున్నామన్నారు.

# కాంగ్రెస్ గూటికి ధర్మపురి...

**నిజామాబాద్:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లో నెంబర్ 2గా పేరున్న నేత ధర్మపురి శ్రీనివాస్. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన నేతగా డీఎస్ కు పేరుంది. తృటిలో డీఎస్ కు సీఎం కుర్చీ మిస్సయ్యిందని జిల్లా కాంగ్రెస్ నేతలు ప్రస్తావించేవారు. కేవలం ఫోన్ ఉంటే రాజకీయాలను చక్కదిద్దటంలో సిద్ధహస్తుడు అని స్వయానా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి డీఎస్ ను ప్రసంసించిన సందర్భాలున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్ రెండు సార్లు పీసీసీ చీఫ్ గా చేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.తొలి నాళ్ల నుంచీ డీఎస్ కాంగ్రెస్ పార్టీ లోనే ఉండేవారు. డీఎస్ కు ఆ స్థాయి గుర్తింపు తీసుకొచ్చింది కూడా హస్తం పార్టీనే. కానీ, 2014 తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో డీఎస్ బీఆర్ఎస్ లోకి చేరటం, ఆ తర్వాత రాజ్యసభ పదవి రావటం జరిగిపోయాయి. ఆ తర్వాత బీఆర్ఎస్ లో తగిన ప్రాధాన్యత లభించకపోవటంతో పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ప్రస్తుతం డీఎస్ రాజ్యసభ పదవీ కాలం కూడా ముగిసింది. తనకు పొలిటికల్ కెరీర్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే తన ప్రయాణం కొనసాగాలని డీఎస్ నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో చేరికకు డీఎస్ కు గ్రీన్ సిగ్నల్ లభించిందని ఆ పార్టీలో వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు డైలమాలో ఉన్న డీఎస్ గతంలో సోనియా గాంధీని కలవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. డీఎస్ సొంతగూటికి చేరుతారన్న ప్రచారానికి సోనియాతో భేటీ అనంతరం స్పష్టత వచ్చింది. హస్తం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైందని తెలుస్తోంది. గతంలో ఢిల్లీలో మకాం



వేసిన డి.శ్రీనివాస్ కాంగ్రెస్ లో చేరేందుకు పార్టీ అగ్రనేతలను కలిసి జరిపిన చర్చలు ఫలించాయంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీతో చర్చలు ఫలించి తిరిగి సొంతగూటికి చేరడం ఖాయమైందని అంటున్నారు. డీఎస్ కాంగ్రెస్ లోకి ఎప్పుడు చేరతారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఉగాదికి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలంటే... డీఎస్ లాంటి సీనియర్లు ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి అవసరం అని అధిష్టానం భావిస్తోంది. బీసీ సామాజికవర్గానికి చెందిన డీఎస్ కు రాష్ట్ర రాజకీయాలపై మంచి అవగాహన ఉంది. డీఎస్ పార్టీలో చేరితే హస్తం పార్టీని వీడిన ఇతర సీనియర్ నాయకులు సైతం తిరిగి సొంతగూటికి వస్తారనే ఆలోచనలో ఉంది కాంగ్రెస్ అధిష్టానం. ఎన్నికలకు కూడా పెద్దగా సమయం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ను వీడిన సీనియర్లను తిరిగి పార్టీలోకి చేర్చుకునేందుకు ఢిల్లీ పెద్దలు ప్రయత్నిస్తున్నారు. సోనియా గాంధీతో డీఎస్ జరిపిన చర్చల ఫలితం.. ముందుగా డీఎస్ పెద్ద కుమారుడు డి.సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని తెలుస్తోంది. మాజీ మేయర్ సంజయ్ గతంలో తండ్రితో పాటు బీఆర్ఎస్ లో కొనసాగారు. కానీ పార్టీ కార్యక్రమాలకు సంజయ్ దూరంగా ఉంటూ వచ్చేవారు. సంజయ్ తండ్రి మాటను కాదని బీఆర్ఎస్ పార్టీలో ఇష్టం లేకున్నా కొనసాగారన్న ప్రచారమూ జరిగింది.ఢిల్లీనుంచి క్లియరెన్స్ రావటంతో డీఎస్ కంటే ముందే డి. సంజయ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటారన్న చర్చ జరుగుతోంది.నిజామాబాద్ జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. డీఎస్, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ వంటి సీనియర్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీని నడిపించారు. డీఎస్ జిల్లా కాంగ్రెస్ కు పెద్దన్న పాత్ర పోషించారు. కనుక డీఎస్ కాంగ్రెస్ పార్టీలో చేరటం మేలు జరుగుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్ కూడా మీడియాతో జరిగిన చిట్ చాట్ లో డీఎస్ చేరిక సోనియా గాంధీ పరిధిలో ఉన్న అంశం... అలాంటి పెద్దలు పార్టీలోకి చేరితే పార్టీకి లాభం చేకూరుతుందంటే మంచిదే కదా అన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీకి మేలు జరిగే నాయకులు వస్తే ఎవరూ వ్యతిరేకించినా వారికి సర్ధిచెబుతున్నామని రేవంత్ అన్నారు. మొత్తానికి డీఎస్ కాంగ్రెస్ లోకి చేరతారని, వచ్చే ఎన్నికల్లో డీఎస్ పెద్ద కుమారుడు సంజయ్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచే బరిలోకి దిగుతారని పార్టీ జిల్లా నేతలు భావిస్తున్నారు.

# కరీంనగర్ లో టీడీపీ ఆవిర్భావ సభ

**కరీంనగర్:**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం మార్చి 29వ తేదీ. ఈ నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.. తెలంగాణలోని కరీంనగర్లో నిర్వహించాలని తెలుగుదేశం అధిష్టానం నిర్ణయించింది. అందులో భాగంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ క్రమంలో స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంతోపాటు అంబేద్కర్ మైదానాన్ని సైతం పార్టీ నేతలు ఇప్పటికే పరిశీలించి... వాటిలో ఒకటి ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సహా పార్టీలోని పలువురు కీలక నేతలు కూడా హాజరుకానున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. అయితే ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ తనదైన శైలిలో ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు దూసుకుపోతున్నారు. ఇంకో వైపు తెలంగాణలో ఎలాగైనా గద్దెనెక్కి.. గులాబీ బాస్ కేసీఆర్‌కు ఝలక్ ఇచ్చేందుకు... మోదీ, అమిత్ షా ద్వయం సారథ్యంలో తెలంగాణలో బీజేపీ నేతలకు స్పష్టమైన సూచనలు.. సలహాలు అందిస్తూ ముందుకు సాగుతోంది. అలాంటి పరిస్థితుల నడుమ రాష్ట్రంలో సైకిల్ పార్టీని సవారీ చేయించేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆ క్రమంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను చంద్రబాబు నియమించారు. అనంతరం గత ఏడాది ఖమ్మం నగరంలో తెలంగాణ నిర్వహించిన శంఖారావ సభ సూపర్... డూపర్... సక్సెస్ అయ్యింది. దీంతో పసుపు పార్టీ శ్రేణుల్లో నయా జోష్ కొట్టొచ్చినట్లు కనిపించింది. అలాగే ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇటీవల హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమం కూడా దిగ్విజయంగా కొనసాగుతోంది. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ హయాంలో తీసుకు వచ్చిన సంక్షేమ పథకాలతోపాటు శాంతి భద్రతలు, హైదరాబాద్ నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను సైతం ప్రజల్లోకి పార్టీ నేతలు చాలా బలంగా తీసుకు వెళ్తున్నారు. ఈ ఏడాది తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు... సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించాలని పార్టీ ముందుగా నిర్ణయించింది. కానీ కంటోన్మెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ మార్చిలో విడుదల కానుందని.. ఈ నేపథ్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కరీంనగర్ వేదికగా జరపాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. కరీంనగర్ సభ తర్వాత ఇటువంటి సభలు మరిన్ని సభలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో తెలుగుదేశం అగ్రనాయకత్వం నిమగ్నమైనట్లు చెబుతున్నారు.

# కమలంలో కవిత కలకలం

**హైదరాబాద్:**

ఒకప్పుడు భారతీయ జనతా పార్టీ ( బీజేపీ) అంటే, అదొక విభిన్న పార్టీ కానీ, ఇప్పుడు కాదు. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో బీజేపీ, అతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి నకలుగా తయారైంది. ఈ మాట ఎవరో బయటి వారు అంటున్న మాటే కాదు.. బీజేపీలోని సీనియర్ నాయకులు, సీనియర్ కార్యకర్తలూ అంటున్నారు. సరే ఆంధ్ర ప్రదేశ్ లో పార్టీకి ఉన్నదీ లేదు పోయేది లేదు కనుక అక్కడ ఎలా ఉన్నా ఎన్ని గ్రూపు తగవులు ఉన్నా పార్టీ అధిష్టానం కూడా పెద్దగా పట్టించుకోలేదు.తెలంగాణలో పరిస్థితి అది కాదు. బీజేపీ జాతీయ నాయకత్వానికి తెలంగాణపై చాలానే ఆశలున్నాయి. అధికారం లక్ష్యగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చినా రాకున్నా పశ్చిమ బెంగాల్ లో లాగా, ఒక బలమైన శక్తిగా ఎదిగే అవకాశం ఉందని పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. నిన్న గాక మొన్న హైదరాబాద్ వచ్చిన కేంద్ర హోం మంత్రి, పార్టీ స్ట్రాటజిస్ట్ (వ్యూహకర్త) అమిత్ షా పార్టీ నాయకులు విబేధాలు మరిచి కలిసి పనిచేస్తే అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అదే మాట ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి రాజకీయ విశ్లేషకులు కూడా చెబుతున్నారు. త్రిపురలో గెలిచిన బీజేపీ తెలంగాణలో ఎందుకు గెలవదని ప్రశ్నిస్తున్నారు.అయితే అందరూకలిసి పని చేయాలని చెప్పి అమిత్ షా అలా వెళ్ళారో లేదో, ఇలా తెలంగాణ రాష్ట్ర బీజేపీలో రుసరుసలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యల వివాదం కమల దళంలో దుమారం రేపుతోంది. బండి వ్యాఖ్యలను బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తప్పు పట్టారు. అలాగే ఆర్వింద్ వ్యాఖ్యలు వంద శాతం సరైనవేనంటూ బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నేత శేఖర్జీ ( పేరాల శేఖర్ రావు) సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు, విమర్శలు పార్టీ నేతల్లో మరింత కలకలానికి కారణమయ్యాయి. అరవింద్ అంటే, కాంగ్రెస్ కల్చర్ లో పుట్టి పెరిగిన నాయకుడు. ఆయన పార్టీ ఎంపీ అయినా, భావజాల పునాదుల పరంగా బీజేపీకి బయటి వ్యక్తి. కానీ శేఖర్జీ ఆలా కాదు. ఆయన పుట్టి పెరిగింది, బీజేపీ మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో, సంఘ్ ప్రచారక్ (పూర్తి సమయ కార్యకర్త)గా, అనేక మందికి ఆదర్శంగా నిలిచిన నాయకుడు.. అయన కూడా క్రమ శిక్షణ ఉల్లంఘించి, సోషల్ మీడియా వేదికగా బండి సంజయ్ మీద విమర్శలు చేయడం అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. నిజానికి, బండి సంజయ్ పై ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలు ఒకెత్తు అయితే, శేఖర్జీ చేసిన విమర్శలు మరింత డ్యామేజింగ్ గా ఉన్నాయని పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి. కవిత పై సంజయ్ చేసిన వ్యాఖ్యలపై, బీఆర్ఎస్ ఎంతగా రాద్ధాంతం చేసినా, ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. నిజానికి బీఆర్ఎస్ కూడా బండి వ్యాఖ్యలను ముందు లైట్ గానే తీసుకుంది, కానీ ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత అరెస్ట్ అయ్యే అవకాశాలు కనిపించడంతో ఇష్యూని డైవెర్ట్ చేసేందుకో ఏమో ఢిల్లీ నుంచి గల్లీ వరకు ... బండికి వ్యతిరేకంగా వీధుల్లోకొచ్చి బీఆర్ఎస్ ఆందోళన చేసింది. ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు కూడా బండి సంజయ్ వ్యాఖ్యలను మరిచి పోయారు. బీజేపీ నాయకులు మాత్రం బండికి అటూ ఇటుగా విడిపోయారు. రాష్ట్ర పార్టీలోని కొందరు నేతలు అర్వింద్, శేఖర్జీ వ్యాఖ్యలను సమర్థిస్తుండగా అసెంబ్లీ ఎన్నికల వేళ ఇలాంటివి పార్టీకి నష్టం చేస్తాయని మరికొందరు చెబుతున్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో కవితపై సంజయ్ చేసిన వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం లేకపోయినా అర్వింద్ ఖండించడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. అదే సమయంలో సంజయ్ వ్యవహారశైలి, రాష్ట్ర అధ్యక్ష పదవి అంటే పవర్ సెంటర్ కాదని, అందరినీ సమన్వయం చేయాల్సిన బాధ్యత ఉంటుందని అర్వింద్ చేసిన వ్యాఖ్యలను మరికొందరు సమర్థిస్తున్నారు. అర్వింద్ చేసిన వ్యాఖ్యలకు కొనసాగింపుగా సంజయ్‌పై శేఖర్జీ మరిన్ని తీవ్ర విమర్శలు, ఆరోపణలు సంధించడంతో పార్టీలో అంతర్గతంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని నేతలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. మరోవైపు వివిధ జిల్లాల్లోనూ పార్టీ ముఖ్య నేతల మధ్య పొసగక గ్రూపుల గందరగోళం కూడా పెరిగినట్లు పార్టీలో చర్చ సాగుతోంది. నిజానికి ఈ వ్యవహారం చినికి చినికి గాలి వానగా మారుతుందా? కేంద్ర పార్టీ ఎలా స్పదిస్తుంది .. చూడాల్సింది చాలా వుంది .. చెప్పాల్సింది మిగిలే వుంది..అంటున్నారు.

# ఢిల్లీ పర్యటనలో జరిగింది చెప్పాలి

**అమరావతి**

అసెంబ్లీ ప్రాంగణంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి లు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ? ఢిల్లీవెళ్లి ప్రధానితో మాట్లాడి, జగన్ రాష్ట్రానికి ఏంసాధించాడో ఆయనే చెప్పాలి. అప్పులఅప్పారావు బుగ్గనతో ఆవుకథలు చెప్పిస్తే ప్రజలు నమ్మరనిఅన్నారు.

విభజనచట్టంలోని హామీలసాధనకోసమే జగన్ ఢిల్లీవెళ్లాడని అప్పులఅప్పారావు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శాసనసభలో ఆవుకథచెప్పాడు. ముఖ్యమంత్రి ఏపనిమీద ఢిల్లీవెళ్తే మీకెం దుకు అని అప్పులఅప్పారావు మమ్మల్ని ప్రశ్నించాడు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హో దాలో 18సార్లుఢిల్లీ వెళ్లాడు. ఏనాడూ దానిపై మేంసభలో మాట్లాడలేదు. కానీ ఇప్పుడు బడ్జె ట్ సమావేశాలుజరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి హుటాహుటిన ఢిల్లీవెళ్లారుకాబట్టే తాము ఏంసాధించడానికి ఆయన ఢిల్లీవెళ్లారో చెప్పాలంటూ వాయిదాతీర్మానం అందించాం. దానికి సమాధానంచెప్పకుండా బుగ్గన మమ్మల్ని తప్పుపట్టాడు. రాష్ట్రంకోసం, ప్రజలకోసం జగన్ ఢిల్లీవెళ్తే, ఆ విషయం చెప్పడానికి బుగ్గనకు ఎందుకంత భయమని ప్రశ్నిస్తున్నా మని అన్నారు. శాసనసభలో జరిగే బడ్జెట్ సమావేశాలకంటే ముఖ్యమంత్రికి ఢిల్లీపర్యటనే ముఖ్యమా.. ఒక వేళ ముఖ్యమైతే ఏమిటంత ముఖ్యమో ఎందుకు చెప్పలేకపోతున్నారు. జగన్ ఢిల్లీ పర్యటన లన్నీ తనకేసులు మాఫీకోసం చేసినవే. వివేకానందరెడ్డిహత్యకేసు నుంచి బయటపడటానికే జగన్ మొన్నటికిమొన్న హుటాహుటిన ప్రత్యేకవిమానంలో ఢిల్లీవెళ్లాడు. కాదు..రాష్ట్రప్రయో జనాలకోసమే వెళ్లాలని ఆయన చెప్పగలడా? అదేఅయితే, కేంద్రప్రభుత్వంలో ఎవరితో ఏంమాట్లాడారో, రాష్ట్రానికి ఎన్నినిధులుసాధించారో, ఏసమస్యల్ని పరిష్కరించారో ముఖ్యమం త్రి ఎందుకు ధైర్యంగా బయటకు చెప్పడంలేదు? వివేకాను చంద్రబాబే చంపించాడని ప్రచారం చేసి, జగన్ గతఎన్నికల్లో లబ్ధిపొందాడు. వివేకాకుమార్తె డాక్టర్ సునీత కోర్టుని ఆశ్రయించబ ట్టే, హత్యకేసు విచారణ సీబీఐవరకు వెళ్లింది. వివేకాను చంపింది ఎంపీ అవినాశ్ రెడ్డేనని, సా క్ష్యాలతో సహా సీబీఐ బయటపెట్టబోతున్న తరుణంలో, అవినాశ్ ను అరెస్ట్ చేస్తారని తెలిపో యిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఢిల్లీపర్యటన ఎవరికైనా అనుమానాలురేకెత్తిస్తుంది. వివేకాహ త్యకేసులో ప్రధాననిందితుడిగా ఉన్న అవినాశ్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి నిన్నఢిల్లీలోనే తిర గడం దేనికి సంకేతం? తమ్ముడిని కాపాడటానికే ముఖ్యమంత్రి, నిన్నప్రధానమంత్రిని కలిశా రని ప్రజలంతా అనుకంటున్నారు. దానిపై జగన్ ఏంసమాధానం చెబుతారని ప్రశ్నించారు. జగన్ ఢిల్లీ ఎందుకెళ్లాడో, ప్రధానితో ఏంమాట్లాడి, రాష్ట్రానికి ఏంసాధించాడో ప్రజలకు చెప్పాలని అన్నారు.

# వైకాపా ఆరాచకపాలపై విజయం

**కాకినాడ**

వైసిపి నిరంకుశ అరాచక పాలనపై రాయలసీమ, ఉత్తరాంధ్ర విద్యావంతుల విజయమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పని, వైసీపి పార్టీ భూస్థాపితానికి శ్రీకారమే నేటి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఆఖనీడ విజయం సాధించిన సందర్భంగా కాకినాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతు రాయలసీమ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలు తీర్పు రాబోయే 2024 ఎన్నికలకు నాంది అని, జగన్ ప్రభుత్వానికి ప్రజలలో ఉన్న వ్యతిరేకత వీటి ద్వారా అర్థమైందని, రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అది కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని విద్యావంతులు, మేధావులు గుర్తించారాని, జగన్ ప్రభుత్వానికి పతనం మొదలైందని, పట్టభద్రల ఎన్నికల ఫలితాలే రాబోయే ఎన్నికలలో పునరావృతం అవుతాయని, వైసిపి నాయకులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా పట్టభద్రులు రాష్ట్ర అభివృద్ధి కొరకు తెలుగుదేశం పార్టీకే పట్టం కట్టారని, వైసిపి నాయకులు అధికారం ఉంది, అవినీతి డబ్బులు ఉన్నాయి, దొంగ ఓట్లు ఉన్నాయిని అధికార మదంతో విర్రవీగారని, ఉత్తరాంధ్ర ప్రజలు కూడా జగన్ రెడ్డి అవినీతి పాలన మాకొద్దని స్పష్టంగా తీర్పునిచ్చారని అన్నారు.జగన్ రెడ్డి ఇకనైనా మూడు రాజధానులు అనే పిచ్చి మాటలు మానుకోవాలని, రాష్ట్ర యువత వారి భవిత బాగుండాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యపడుతుందనే బావన ఈనాటి వెలువడిన ఎన్నికల ఫలితాలలో స్పష్టంగా అర్థమైందిని, వైసీపి పార్టీ చెత్త పరిపాలనతో రాష్ట్ర ప్రజానీకం విసిగి వేసారి పోయారని,రాబోయే 2024 ఎన్నికలలో రాష్ట్రమంతటా ఇవే ఫలితాలు వెలువడి తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, కొల్లాబత్తుల అప్పారావు, బంగారు సత్యనారాయణ, అంబటి చిన్న, ఒమ్మి బాలాజీ, చెక్క శ్రీనివాస్, చింతా పేర్రాజు, అమన్ జైన్, పంతాడి రాజు, దండుప్రోలు నాగబాబు, చిక్కాల సత్యవతి, కొల్లు కుమారి, మీసాల సునీత, చింతలపూడి రవి, పసుపులేటి వెంకటేశ్వరరావు, ఎరిపిల్లి రాము, దేవు జయలక్ష్మి, వడిసెల దాలమ్మ, ముగు రాజు, చోడుపల్లి సతీష్, గుమ్మల్ల చిన్నా, నీలకాయల సన్నీ, చోడుపల్లి ప్రేమ్, గురుసు దుర్గారావు, పెదపూడి కుమార్, లిఖితపూడి శ్రీధర్, బూడి ప్రకాష్, సంఘాని నాగూర్, సాగే సత్తిబాబు, బుంగా నాగరాజు, బొచ్చా దాసు, పోలిపల్లి జగన్, జొన్నాడ వెంకట రమణ, గంపల లక్ష్మణరావు, అరదాడి శివ, చొక్కా గిరి, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, పాలిక నాని, తాడి శ్రీను, రెడ్నం సత్తిబాబు, అమలకంటి బలరాం, పొంగా బుజ్జి, ఆలీషా, బొడ్డు రాజు, అబ్బాయి, సంఘాన్ని సూరిబాబు, డొక్కాడి శ్రీను, బాబి, నక్క సూరిబాబు, నిద్రబింగి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ను భర్తరఫ్ చేయాలి

## టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

**కామారెడ్డి**

తెలంగాణ తెచ్చిన అని కేసీఆర్ అబద్ధం చెప్పినా రెండు సార్లు అవకాశం ఇచ్చారు. నోటికొచ్చిన అబద్దాలతో గద్దెనెక్కిన కేసీఆర్ ప్రజల గుండెలపై తంతున్నారని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. 30లక్షల మంది నిరుద్యోగులు టీఎస్ పీఎస్సీలో నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యలు చేసుకున్నా నిరుద్యోగుల సమస్యను కేసీఆర్ పరిష్కరించలేదు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ పోరాడితే 80వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. రాష్ట్రంలో ఎంసెట్, ఏఈ, సింగరేణి, విద్యుత్ శాఖ, గ్రూప్-1 పేపర్లు లీక్ అయ్యాయి. రాష్ట్రంలో ఏ పరీక్షలు చూసినా పేపర్ లీకులే నని అన్నారు.

బీఆర్ఆర్ఎస్ దొంగలు, పైరవీకారులకు ముందే ప్రశ్నపత్రాలు అందుతున్నాయి. పేపర్ లీక్ వ్యవహారంలో చిన్న చేపలను బలి చేసి.. చైర్మన్, బోర్డు మెంబర్లు, కేటీఆర్, కేసీఆర్ తప్పించుకుంటున్నారు. పరీక్ష పేపర్ లీకేజ్ కు కారణం కేటీఆర్. కేటీఆర్ ను మంత్రి పదవి నుంచి ఎందుకు బర్తరఫ్ చేయరు? బిడ్డ కోసం మంత్రులను ఢిల్లీ కి పంపించిన కేసీఆర్, పేపర్ లీకేజీపై ఎందుకు సమీక్షించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రేపు అన్ని మండల కేంద్రాల్లో కేసీఆర్, కేటీఆర్ దిష్టి బొమ్మలను దహనం చేయండి. పేపర్ లీక్ వ్యవహారంపై 22న కాంగ్రెస్ ముఖ్య నేతలమంతా గవర్నర్ ను కలుస్తాం. బీఆరెస్, బీజేపీ కుమ్మక్కు ఏమిటో అమీతుమీ తేల్చుకుంటాం. నిరుద్యోగుల జీవితాలు ఆగమైతుంటే గవర్నర్ ఎందుకు సమీక్షించడం లేదు? తక్షణమే కేటీఆర్ ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి. టీఎస్ పీఎస్సీ సభ్యులను రాజీనామా చేయించి, సిట్టింగ్ జడ్జి తో, లేదా సీబీఐ తో విచారణ చేయాలి. పరీక్షల్లో అవకతవకలపై కాంగ్రెస్ పోరాడుతుంది. కేసీఆర్ పాలనకు ఇక కాలం చెల్లింది. దేవుడు కూడా కేసీఆర్ పక్షాన లేదని అన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## ఏఎంవిఐ పై దాడి-ఖండించిన అధికారులు

**కాకినాడ**

విధి నిర్వహణలో ఉన్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ ఎం.చిన్నారావుపై ఒక వ్యక్తి దాడి చేయడాన్ని అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎస్.వి.ప్రసాదరావు తీవ్రంగా ఖండించారు. కాకినాడ డి.టి.సి. కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా ప్రసాద రావు మాట్లాడుతూ కాకినాడలో కొబ్బరి బోండాలు అమ్మే వ్యక్తి చేసిన దాడిలో తీవ్రంగా గాయ పడిన అసిస్టెంట్ మోటర్ ఇన్స్పెక్టర్ చిన్నారావు ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నారని, విధుల నిర్వహణలో ఉన్న అధికారి పై ఏవిధమైన దాడి జరగడం చాలా విచారకరమన్నారు.ఈ సంఘటనపై రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ ఈ ఘటనపై తీవ్రంగా ఖండించారని తెలిపారు . జిల్లా పోలీసు సూపరింటెండెంట్ యమ్. రవీంద్రనాథ్ బాబు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు పలు సెక్షన్ల క్రింద కేస్ నమోదు చేశారని చట్ట ప్రకారం చర్యలు తీసుకుని శిక్ష పడేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ మీడియా సమావేశంలో జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సి.హెచ్. శ్రీదేవి, రవాణా శాఖ అధికారులు ఐ. రాజబాబు, ఆర్. సురేష్, పి.వి. సాయిబాబు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థినిని మేడపై నుండి తోసేసిన తోటి విద్యార్థినులు

**కోనసీమ**

అంబెడ్కర్ కోనసీమ జిల్లా ముక్తేశ్వరంలో ఉన్న వైవిఎస్ డ బి.ఆర్.ఎస్.ఎం నర్సింగ్ కాలేజీలో దారుణం జరిగింది తోటి విద్యర్థినిలే మరో విద్యార్థినిని మేడ పై నుండి తోసేవేసారు. నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పల్లవి(19), శనివారం ఉదయం రెండవ అంతస్థు పై నుండి గెంటేసారు. ఘటనలో పల్లవి కి తీవ్ర గాయాలు అయ్యాయి. కాలు, చేయి, మూడు చోట్ల ఎముకలు విరిగాయి. పల్లవిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాలేజీ హాస్టల్ రూంలో ఎనిమిది మంది విద్యార్థినులు కలిసిన ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఒకరి డబ్బులు పోయాయని అందరి బ్యాగ్స్ వెతికారు. ఉదయం బ్రెష్ చేస్తున్న సమయంలో తనను వెనక నుండి గెంటేశారని పల్లవి అంటోంది.

## అరగంటలో అమెరికా మటాష్ !:

**న్యూఢిల్లీ**

అమెరికాను అరగంటలో ఢీ కొట్టే ఇంటర్కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ను ఉత్తరకొరియాఅభివృద్ధి పరిచింది. ఇది 33 నిమిషాల్లో అమెరికాలోని లక్ష్యాలపై గురి తప్పకుండా ఢీ కొంటుందని చైనా అధ్యయనంఒకటి తేల్చింది. ఓపెన్ న్యూక్లియర్ నెట్వర్క్ అనలిస్ట్ తియన్రాన్ జుతెలిపిన వివరాలు అమెరికా వెన్నులో వణుకు పుట్టించేవిలా ఉన్నాయి. అమెరికాలో ఇప్పటికే ఉన్న క్షిపణి రక్షక వ్యవస్థ కూడా ఉత్తరకొరియా అభివృద్ధి చేసిన తాజా మిసైల్ను గుర్తించలేదట. ఉత్తరకొరియానుంచి ప్రయోగించిన 20 సెకండ్ల వరకూ అమెరికాకు కనీసం గుర్తించడం కూడా సాధ్యం కాదట. అమెరికాలోని తూర్పు తీరాన్ని అలాగే పశ్చిమతీరాన్ని కూడా ఈ క్షిపణి సులభంగా చేరగలదట. హ్వాసోంగ్-15పేరిట ఉత్తరకొరియాలోని కిమ్ ప్రభుత్వంఅభివృద్ధి పరిచిన ఈ అణ్వస్త్ర క్షిపణి రేంజ్ 13 వేల కిలోమీటర్లు.చైనా అధ్యయనంలో వెల్లడైన అంశాలపై అమెరికాలోని బైడెన్ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

## కారు దగ్ధం..ప్రయాణికులు క్షేమం

**సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా పరిధిలోని చింతలపాలెం మండలం, కిస్టాపురం లో రోడ్ మీద వెళ్తున్న ఒక కారు ఇంజన్ లో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో.. భయాందోళనకు గురైన ఇద్దరు ప్రయాణికులు వెంటనే కారు నుంచి దిగిపోయారు. తరువాత ఒక్కసారిగా కారు మొత్తం క్షణాల్లో మంటల్లో చిక్కుకుంది. కారు దిగడంతో ఆ ఇద్దరు ప్రాణాలు దక్కిచుకున్నారు. చుట్టుపక్కల వాళ్లు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ, కారు మొత్తం మంటల్లో దగ్ధమయింది.

## క్యూ నెట్ లో చేరవద్దు

**హైదరాబాద్,**

క్యూనెట్ సంబంధింత అంశం ఎప్పుడొచ్చినా అగ్రెసివ్గా స్పందించే ఓ ఆఫీసర్ సజ్జనార్. క్యూనెట్ వ్యవహారాలను, మోసాలను గతంలో ఆయనే తెరపైకి తెచ్చారు. సైబరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కేసులు కూడా పెట్టారు. కేసులు పెట్టిన ప్రతిసారి పేరు మార్చుకుని మరో రూపంలో మల్టీ చైన్ మార్కెటింగ్ సిస్టమ్ను నడిపిస్తూ క్యూనెట్ మోసం చేస్తోంది. తాజాగా ఆరుగురి ప్రాణాలను బలితీసుకున్న సికింద్రాబాద్ స్వప్నలోక్ అగ్నిప్రమాద ఘటన విషయంలోనూ క్యూనెట్ పేరే తెరపైకి వచ్చింది. ఉద్యోగమంటూ ఐడీ కార్డులిచ్చి, ఐడీ కార్డుల కోసం డబ్బు వసూళ్లు చేసి, ఆపై వాళ్ల ఓఒఓ వ్యాపారాలు చేస్తున్న విషయం తేటతెల్లమయ్యింది.సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాద ఘటనలో దుర్మార్గపు సంస్థ క్యూ నెట్ పాత్రపై సమగ్ర విచారణ జరగాలి సజ్జనార్ సూచించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాదు.. యువతీయువకులు ఎవరూ క్యూనెట్ తరహా కంపెనీల వలలో పడొద్దని పదేపదే విజ్ఞప్తి చేశారు. ఎంఎల్ఎం సంస్థలు, వాటి అనుబంధ సంస్థల పట్ల దర్యాప్తు సంస్థలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మోసపూరిత సంస్థల కదలికలపై లా ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీస్ నిఘా పెట్టాలన్నారు

# బీసీల బడ్జెటు 2 లక్షల కోట్లు కేటాయించాలని ఏప్రిల్ 3 మరియు 4న ఛలో ఢిల్లీ

**హైదరాబాద్ :**



కేంద్ర ప్రభుత్వం బీసీల బడ్జెటు 2 లక్షల కోట్లకు కేటాయించాలని బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 3 మరియు 4న చలో ఢిల్లీ కార్యక్రమం పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరపాలని రాజ్యసభ జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య పిలుపు నిచ్చారు. మం సందర్భంగా బీసీ భవన్ నందు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్ లాల్ కృష్ణ. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నీల వెంకటేష్ అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది.ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికలలో బి సి లకు అన్ని రాజకీయ పార్టీలు బి సి లకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. బి.సి లకు అన్యాయం చేసే పార్టీల బరతం పడతామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బి సి లను ఓటు బ్యాంకు గా వాడుకుంటున్నారు. రాజ్యాధికారంలో వాట ఇవ్వకుండా 75 సం.లుగా అన్యాయం చేస్తూన్నారు. జెండాలు మోసుకుంటు, జిందాబాద్ ల నినాదాలు ఇస్తూ బిసిలను వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమం లో అంజి, వేముల రామకృష్ణ, సతీశ్, నరసింహ గౌడ్, రావుల రాజు,కృష్ణమాచారి, శ్రీమాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబరు నుంచి లీక్ వ్యవహారం...

**హైదరాబాద్ :**

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీసె కమిషన్ - టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంలో షాకింగ్ విషయాలు బయటకొస్తున్నాయి. సిట్ అధికారుల దర్యాప్తులో విస్మయ పరిచే విషయాలు వెలుగుచూస్తున్నాయి. సిస్టమ్ అనలిస్ట్ రాజశేఖర్, కార్యదర్శి పీఏ ప్రవీణ్ ఇద్దరు కలిసి అక్టోబర్ నుంచి ప్రశ్నాపత్రాలు లీక్ చేస్తున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. టీఎస్పీఎస్సీ కార్యాలయంలో అంతా తానే వ్యవహరించే రాజశేఖర్.. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎలాంటి వివరాలను అయినా దొంగలించి ప్రవీణ్ కు అందజేసే వాడని తేలింది.టీఎస్పీఎస్సీ కార్యాలయంలో రాజశేఖర్, ప్రవీణ్ చేసిన అక్రమాలు చూసి ఉన్నత అధికారులు సైతం విస్తుపోతున్నారు. టౌన్ ప్లానింగ్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందన్న ఫిర్యాదు మేరకు అధికారులు దర్యాప్తు చేయగా ప్రవీణ్ వ్యవహారం బయటపడింది. తన స్నేహితురాలు రేణుక అభ్యర్థన మేరకు మిత్రుడు రాజశేఖర్ తో కలిసి ఏఈఈ క్వశ్చన్ పేపర్ లీక్ చేశారన్నదంతా అబద్ధమని తేలింది. ఈ ప్రశ్నాపత్రాల లీకేజీ కేవలం ఏఈఈ పరీక్షకు మాత్రమే పరిమితం కాలేదని, అలా నమ్మించేందుకు మాత్రమే రేణుక ప్రస్తావన తెచ్చాడని తేలింది. వాస్తవానికి మిగతా ప్రశ్నాపత్రాలనూ ప్రవీణ్, రాజశేఖర్ ముఠా చోరీ చేసినట్లు తెలుస్తోంది.కమిషన్ కార్యాలయానికి చెందిన ఓ ఉద్యోగి యూజర్ ఐడీ, పాస్ వర్డ్ దొంగలించి దాని ద్వారా ఫిబ్రవరిలో ప్రశ్నాపత్రాలు ఉన్న ఫోల్డర్ ను నాలుగు పెన్ డ్రైవ్ లలో కాపీ చేసుకున్నట్లు రాజశేఖర్ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అయితే అక్టోబరులోనే ప్రశ్నాపత్రాలు తస్కరించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అక్టోబర్ లో జరిగిన గ్రూపు-1 ప్రిలిమ్స్ లో ప్రవీణ్ కు మంచి మార్కులు వచ్చాయి. ఈ విషయం అధికారులకు తెలియడంతో కొత్త అనుమానాలు వచ్చాయి. దీంతో లోతుగా దర్యాప్తు చేయగా.. అక్టోబరు నుండే ప్రశ్నాపత్రాలు లీక్ చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు.అధికారుల దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే పెన్ డ్రైవ్ నాటకం ఆడారని తేలింది. ఏడాది క్రితం టీఎస్పీఎస్సీ ఆఫీసులోని కంప్యూటర్లను అప్ గ్రేడ్ చేశారు. అప్పటి నుంచే రాజశేఖర్, ప్రవీణ్ కంప్యూటర్లను హ్యాక్ చేయాలని పతకం పన్నినట్లు అధికారులు గుర్తించారు. కార్యదర్శి, ఛైర్మన్ లకు మాత్రమే ఆజమాయిషీ ఉండే కాన్ఫిడెన్షియల్ విభాగంలోని కంప్యూటర్లలో ప్రశ్నాపత్రాలు ఉంటాయి. ఈ విషయం తెలుసుకున్న రాజశేఖర్.. నెట్ వర్క్ అప్ గ్రేడేషన్ పేరుతో డైనమిక్ ఐపీని స్టాటిక్ ఐపీగా మార్చేశాడు. కాన్ఫిడెన్షియల్ విభాగంలోని కంప్యూటర్ ను హ్యాక్ చేశాడు. అలా అక్టోబరులో జరిగిన గ్రూపు-1 ప్రశ్నాపత్రాన్ని దొంగలించాడు. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు గ్రూప్-1, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సీడీపీఓ, సూపర్ వైజర్ గ్రేడ్-2, ఏఈఈ, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏఈ ఇలా మొత్తం 7 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించారు. వీటన్నింటి ప్రశ్నాపత్రాలు లీకైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో గ్రూపు-1లో 100 కన్నా ఎక్కువ మార్కులు వచ్చిన వారందర్నీ పిలిచి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రవీణ్, రాజశేఖర్ ఫోన్ డేటా ఆధారంగా విచారణ చేస్తున్నారు. లీకైన ప్రశ్నాపత్రాలు పొంది వారిని ఈ కేసులో నిందితులుగా చేర్చనున్నారు.

# మహిళా కమిషన్ ముందు హాజరైన బండి

**హైదరాబాద్:**

ఎమ్మెల్సీ కవితపై వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్ర మహిళా కమిషన్ ముందు హాజరయ్యారు. కవితపై చేసిన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ కు బండి సంజయ్ వివరణ ఇచ్చారు. రెండు పేజీల వివరణ లేఖ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. బండి సంజయ్ తన వివరణలో కవితను ఉద్దేశించి మాట్లాడిన మాటలను సమర్థించుకున్నారు. తెలంగాణ వాడుక భాషలో ఉపయోగించే పదాలనే తాను మాట్లాడినట్లు సమాధానం ఇచ్చారు. తెలంగాణ కుటుంబ సభ్యులు ఉపయోగించే భాషనే ఉపయోగించినట్లు చెప్పారు. మరో వైపు కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మహిళా కమిషన్ ఆఫీసు ఎదుట నిరసనకు దిగింది. ఎమ్మెల్సీ కవితకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బండి సంజయ్ సమాధానం పట్ల మహిళా కమిషన్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. ఇంకా విచారణ కొనసాగుతోంది. ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణపై స్పందించిన బండి సంజయ్... తప్పు చేసిన వారిని అరెస్ట్ చేయక ముద్దు పెట్టుకుంటారా అంటూ సంచలన కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలను రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్గా తీసుకుంది. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని కమిషన్ మండిపడింది. ఆయనపై 354, 506 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ నేతలు కేంద్ర మహిళా కమిషన్ ను కూడా కలిసి ఫిర్యాదు చేశారు. కేసును సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఈ నెల 13న హాజరవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. అయితే పార్లమెంటు సమావేశాల కారణంగా 18న హాజరవుతానని ఆయన కమిషన్ను కోరారు. ఆ మేరకు హాజరయ్యారు. మహిళా కమిషన్ ఎదుట బండి సంజయ్ హాజరు అవుతారని ఎవరూ అనుకోలేదు. బండి సంజయ్ వివరణపై సంతృప్తి చెందకపోతే మహిళా కమిషన్ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మహిళా కమిషన్ కు జ్యూడిషియల్ పవర్స్ లేవని చర్యలు తీసుకునే అధికారం లేదని బీజేపీ నేతలు చెబుతున్నారు.

# సప్తవర్ణశోభితం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పుష్పయాగం

**తిరుపతి,**

శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం వైభవంగా పుష్పయాగం జరిగింది. ఆలయంలో ఫిబ్రవరి 14 నుండి 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 నుండి 4.30 గంటల వరకు పుష్పయాగం నిర్వహించారు. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల పూలు, ఆరు రకాల ఆకులు కలిపి మొత్తం 3.5 టన్నుల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. ఆద్యంతం శోభాయమానంగా సాగిన ఈ పుష్పయాగ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు.

## డబల్ బెడ్ రూమ్ ల కోసం రాస్తారోకో

**యాదాద్రి భువనగిరి**

భువనగిరి పట్టణ డబుల్ బెడ్ రూమ్ ఎంపిక విషయంలో పూర్తిగా అవకతవకలు జరిగాయని అనర్హుదారులు అందోళనకు దిగారు. వార్డు సభలలో ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకటనలో అనర్హుదారులు శనివారం నాడు అర్హులైన పేద వారికే ఇండ్లను కేటాయించాలని హైదరాబాద్ వరంగల్ ప్రధాన రహదారి హైదరాబాద్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్ ఈరపాక నరసింహ తదితరులు నిరసనకు మద్దతు తెలిపారు. రోడ్డుపై బైఠాయింపుతో కాసేపు భారీగా ట్రాఫిక్ జాం అయిది. ,పోలీసుల జోక్యంతో నిరసనకారులు ధర్నాను విరమించుకున్నారు.

## కలెక్టరేట్ దగ్గర ఉద్రిక్తత

**ములుగు**

ములుగు జిల్లా కేంద్రంలోని ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కలెక్టర్ కార్యాలయం ముందు బిజెపి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. గ్రూప్ వన్ పశ్న పత్రం లీకేజీలో బాధ్యులను శిక్షించాలంటూ ఆందోళన చేసారు. కలెక్టర్ కార్యాలయంలోకి చోచ్చుకుపోవడానికి ప్రయత్నం చేసారు. ఈ నేపథ్యంలో బిజెపి కార్యకర్తలను, పార్టీ నేత నగరపు రమేష్ లను ఉడ్చికెళ్లారు.

## అవినీతి పాలనకు చరమగీతం

**కౌతాళం**

అవినీతి పాలనకు చరమగీతం పాడాలని ప్రజల్లో మార్పు మొదలైంది అని పట్టభద్రులు ఓటుతో బుద్ధి చెప్పారని జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప పేర్కొన్నారు. పార్టీ కార్యాలయం నందు కార్యకర్తలు అభిమానులు నందమూరి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్సీ మూడు తెలుగుదేశం కైవసం చేసుకున్నందుకు శుభ సందర్భంగా బాణాలు పేల్చి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో తెలుగుదేశం కైవసం చేసుకుంటుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు ప్రజల్లో మార్పు వైసీపీ పార్టీ పతనానికి నాంది పలుకుతుందని అన్నారు రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి బలోపేతం చేయాలని కార్యకర్తలను సూచించారు. పార్టీ కోసం భారీగా శ్రమించలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపధ్యక్షులు వెంకటపతి రాజు రహిమాన్ ,మంజునాథ, కాశీ విశ్వనాథ్, రమేష్ ,కృష్ణ, వలి ఉమేష్, డాక్టర్ రాజానంద్, శ్రీరామ్ అభిమానులు భారీగా సంబరంలో పాల్గొన్నారు.

## విశాఖలో హలీం రెడీ

**విశాఖపట్నం**


హలీమ్ ఈ పేరు చెబితేనే చాలు నోరూరిపోతుంది. మరి హలీమ్ అంటే వెంటనే గుర్తుకొచ్చే పండుగ రంజాన్. రంజాన్ మాసం వచ్చిదంటే చాలు విశాఖ నగరం అంతా హలీం వాసనలు ఘుమ ఘుమలాడిపోతాయి. రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం హలీమ్ తో ఉపవాసాన్ని ముగిస్తారు ముస్లిం సోదరులు.రంజాన్ పండుగకు ముందే నగరంలో హలీం విక్రయాలు ప్రారంభమైపోయాయి.ఇప్పటికే పలు స్టాల్స్ లో ఘుమఘుమలాడించే హలీం రెడీ రెడీ అయిపోయింది. రారామ్మని.. హలీం ప్రియులను ఆహ్వానిస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో హలీం తయారు చేస్తు విక్రయాలు జోరందుకున్నారు. గత రెండేళ్లుగా రంజాన్ పండుగ వేసవికాలంలోనే రావటం విశేషం.

## పసికందు మృతి..బంధువుల అందోళన

**హైదరాబాద్**

హైదరాబాద్ సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చిన ఓ నిండు గర్భిణీకి వైద్య సిబ్బంది శస్త్ర చికిత్స నిర్వహించారు. అయితే ఈ క్రమంలోనే అప్పుడే పుట్టిన శిశువు చనిపోయింది. ఇదే విషయాన్ని వైద్యులు... ఆ యువతి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. బిడ్డ పుట్టక ముందే చనిపోయిందని వెల్లడించారు. కానీ కుటుంబ సభ్యులు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. శస్త్ర చికిత్సకు ముందు వరకు శిశువు చాలా బాగుందని చెప్పిన మీరే బిడ్డ చనిపోయిందని చెప్పడం వెనుక ఏదో పెద్ద కారణమే ఉందని ఆరోపిస్తున్నారు. ఆపరేషన్ చేసి పసికందును బయటకు తీస్తుండగా కిందపడి చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే బాధిత బంధువులు, కుటుంబ సభ్యులు అంతా కలిసి నిరసనకు దిగారు. ఆస్పత్రి ఎదుట బైఠాయించి తమకు న్యాయం చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని అన్నారు.వైద్యుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి మృతి చెందినట్లు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. కుటుంబ సభ్యులు, బంధువులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసుల ఎదుటే వైద్యులు.. బిడ్డ పుట్టకముందే అంటే కడుపులోని చనిపోయిందని వివరించే ప్రయత్నం చేశారు. కానీ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం వెనక్కి తగ్గలేదు. తమకు న్యాయం చేసే వరకు ఆస్పత్రి నుంచి కదిలేది లేదని చెప్పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం చేస్తేనే నిజా నిజాలు తెలుస్తాయని అంటున్నారు.

# మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' ప్రత్యేక పాత్రలో సుశాంత్



మెగాస్టార్ చిరంజీవి, స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ ల క్రేజీ ప్రాజెక్ట్ "భోళా శంకర్". ఈ మెగా మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో కీలక పాత్రల్లో ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్ చిరంజీవి సిస్టర్ గా కనిపించనుంది. ట్యాలెంటెడ్ యాక్టర్ సుశాంత్ ఈ సినిమాలో చాలా ప్రత్యేకమైన , లవర్ బాయ్ తరహా పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ ఈరోజు అనౌన్స్ చేశారు. సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని తెలియజేశారు.సుశాంత్ లీడ్ రోల్స్ తో పాటు ఇతర హీరోల సినిమాల్లో కీలక పాత్రలని ఎంపిక చేసుకుంటున్నారు. భోళా శంకర్‌లో అతని పాత్ర చాలా కీలకంగా వుంటుంది. పోస్టర్‌లో సూట్‌లో లైట్ గడ్డంతో ఛార్మింగా కనిపిస్తున్నాడు.మహా శివరాత్రి సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన మోషన్ పోస్టర్ చిరంజీవిని ఫెరోషియస్ అవతార్‌లో ప్రజంట్ చేసింది. మిగతా ప్రమోషనల్ కంటెంట్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్ , రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు.







# బిచ్చగాడు 2 నుండి బికిలి సాంగ్ రిలీజ్



వైవిధ్యమైన సినిమాలతో తమిళ్ లో తనదైన శైలిలో రాణిస్తోన్న హీరో విజయ్ ఆంటోనీ. గతంలో నకిలీ, డాక్టర్ సలీమ్ చిత్రాలతో ఆకట్టుకున్న విజయ్ ఆంటోనీ.. బిచ్చగాడు మూవీతో తెలుగులోనూ స్టార్డమ్ తెచ్చుకున్నాడు. ఈ మూవీ అతనికి తిరుగులేని మార్కెట్ ను ఇచ్చింది. ప్రస్తుతం బిచ్చగాడుకు సీక్వెల్ గా మరో సినిమాతో వస్తున్నాడు విజయ్. ఈ చిత్రాన్ని తనే నిర్మిస్తూ డైరెక్ట్ చేస్తున్నాడు. దర్శకత్వంతో పాటు సంగీతం, ఎడిటింగ్ బాధ్యతలు కూడా తనే నిర్వర్తిస్తున్నాడు. బిచ్చగాడు2 అనే టైటిల్ తో పాటు బికిలి అనే టైటిల్ కూడా పెట్టాడు విజయ్ ఆంటోనీ. అయితే ఈ బికిలి అనే పదానికి అర్థం ఏంటీ అంటూ కొన్నాళ్లుగా చాలామంది కన్ఫ్యూజ్ అవుతున్నారు. వారి కన్ఫ్యూజన్ ను క్లియర్ చేస్తూ.. బికిలీ అనే పదానికి అర్థం చెబుతూ.. లేటెస్ట్ ఈ మూవీ నుంచి లిరికల్ సాంగ్ ను విడుదల చేశారు.పాటలో మొదట బికిలీ అంటే ఏంటీ అనేదానికి వివరణ ఇస్తూ "నమస్కారం.. నేను విజయ్ ఆంటోనీని మాట్లాడుతున్నాను. నేను బాగా ఆలోచించి ఆలోచించి.. ఏదో నా వల్ల అయిన ఒక కొత్త చెడ్డ పదాన్ని కనిపెట్టాను. చెడ్డపదం అంటే మీరనుకుంటున్నట్టు.. మాట్లాడ్డానికి అసహ్యంగా ఉండే పదం కాదు. వినేవాళ్లకు అది అసహ్యంగా ఉండే పదం. నేను కనిపెట్టిన ఆ కొత్త పదం పేరు బికిలీ. పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన దగ్గరున్న ధనబలంతో వాళ్ల పొట్టను కొట్టి వాళ్లను బానిసలుగా మార్చి డబ్బుందన్న అహంకారంతో తిరిగేవాడే బికిలీ. మనలో చాలామంది ఎంత కష్టపడి పనిచేసినా ముందుకెళ్లలేక తలపట్టుకుని డిప్రెషన్ లోకి వెళ్లడానికి కారణం.. ఈ బికిలీలే. వాళ్లను మనం ఏం చేయలేకపోయినా.. బికిలీ అనే పదంతో పిలవొచ్చు. ఈ రోజు నుంచి నేను కనిపెట్టిన ఈ బికిలీ పదం.. భారతదేశంలో వాడకంలోకి వస్తుంది.." అంటూ విజయ్ ఆంటోనీ చెప్పిన మాటలతో మొదలైన వీడియో సాంగ్.. 'వీళ్లే బికిలి బికిలి బిలి బిలి.. బికిలి బికిలి బిలి బిలి...' అంటూ మొదలై.. మూవీ థీమ్ ను తెలియజేస్తూ.. కొందరికి హీరో ఎందుకు బికిలీ అనే పేరు పెట్టాడు అనే వివరణ ఇచ్చే సాహిత్యంతో మాంటేజ్ సాంగ్ గా సాగుతోంది. 'లేనివాళ్లను తొక్కిపెట్టి నమ్మి వస్తే ముంచివేసి చెవిలోనా పెట్టెరా పువ్వులు, పక్కనుండి గొయ్యి తీసి నిద్రపుచ్చి గొంతు కోసి ఏడిపించే నవ్వేరా నవ్వులు.. పేరు గొప్ప ఊరు దిబ్బ' అంటూ అర్థవంతమైన సాహిత్యంతో సాగే ఈ గీతాన్ని కంపోజ్ చేసి, పాడటమే కాదు.. రాసింది కూడా విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. బిచ్చగాడు విడుదలైన అన్ని భాషల్లోనూ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. దీంతో రెండో భాగంపైనా భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలను అందుకోవడానికి త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికైతే గతంలో విడుదలైన థీమ్ సాంగ్ తో పాటు ఈ బికిలీ పాటతో ప్రేక్షకుల్లో ఆసక్తిని క్రియేట్ చేసింది బిచ్చగాడు2 మూవీ.

ఈ వేసవి బరిలోనే విడుదల కాబోతోన్న ఈ చిత్రంలోదేవ్ గిల్, హరీష్ పెరడి, జాన్ విజయ్, రాధా రవి, మన్సూర్ అలీ ఖాన్, వైజీ మహేంద్రన్, రాజా కృష్ణమూర్తి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950